RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి మీకోసం

తెలుగు దినపత్రిక ఎడిటర్: మల్లె నాగిరెడ్డి



2లో 2లో

గోవా లైరాదేవి ఆలయంలో తొక్కిసలాట

## ఆరుగురు వ్యక్తుల దుర్మరణం



2లో

కేంద్రం కులగణన

## నిర్ణయం

నల్గొండ హైదరాబాద్ సంపుటి : 3. సంచిక :234 ఆదివారం 04 మే 2025 పేజీలు 8 వెల: రూ. 1.00 epaper.manasakshi.in



## హైదరాబాద్ చేరుకున్న మిస్ కెనడా సుందరి

**హైదరాబాద్,మనసాక్షి:** హైదరాబాద్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాల సుందరీమణుల రాక ప్రారంభమయింది. ఈ మిస్ వరల్డ్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్ కు చేరుకుంటారు. మిస్ కెనడా మిస్ ఎమ్మా డీనా కాథరిన్ మోరిసన్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. శంషాబాద్ కు చేరుకున్న మిస్ కెనడా కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు.



2లో

రహదారుల అభివృద్ధితోనే

## పెట్టుబడులు సాధ్యం

తెలంగాణలో రహదారుల విస్తరణకు కృషి

రేపు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి గడ్కరీ రాక

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



## పెరుగుతున్న నిత్యావసర ధరలు

## చోద్యం చూస్తున్న ప్రభుత్వాలు

అడ్డూ అదుపు లేకుండా పెరుగుతన్న నిత్యావసరాల ధరలు సామాన్య,మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి.

ఉప్పు, పప్పు, నూనె, పెట్రోల్.. ఇలా అన్నింటి ధరలు అందనంతగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మందుల ధరలు కూడా సైలెంట్‌గా పెంచేశారు.

**న్యూఢిల్లీ,మనసాక్షి:** సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ధరలు మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. వ్యాపారులు కూడా సమయం చూసి ధరలు పెంచేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు దాడి చేస్తున్నాయి. పెట్రో ధరలతో అన్నిరకాల వస్తువుల ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. చాయ్ సింగిల్ కనీసం 15 రూపాయలుగా అమ్ముతున్నారు. మూడేళ్లలో నెలసరి ఇంటి ఖర్చులు ఏకంగా 5 వేలు దాటేశాయి. ఈ ధరాఘాతంతో బతకలేక సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ ధరలకు తోడు కరెంటు బిల్లులు, పెట్రోల్ బాదుడు కూడా అదనంగా వచ్చి చేరింది. ప్రభుత్వాలు ధరలను అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. ధరలు పెరగడం సహజం అన్న ధోరణిలో ఉన్నారు. తమకు అందుబాటులో ఉన్న పెట్రోల్, గ్యాస్, విద్యుత్ తదితర వస్తువులపై వడ్డింపులు వేస్తూనే ఉన్నారు. దీనికితోడు జిఎస్టీ వడ్డింపులు శరాఘతంగా మారాయి. సామాన్యులు బతకడం దుర్లభంగా మారింది. ధరల పెరుగుదలను తలచుకుంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి ఖర్చు సగటున నెలకు రూ. 5వేలకు పైగా పెరిగింది. ప్రతి ఒక్కరిపైనా ఏటా 5 నుంచి 10 శాతం పెంపుతో అదనపు భారం తప్పదు. పంటలు దెబ్బతిని గ్రామాల్లో ఉపాధి కరవైంది. అటు పనుల్లేక, ఇటు ఖర్చులు పెరిగి ఇబ్బందులు

మిగతా 2లో

# మానవాళి మనుగడకు ఉగ్రవాదం ప్రమాదకరం

దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

దానికి సహకరించేవారిని కూడా వదిలిపెట్టం

మరోఆరు ఘాటు హెచ్చరిక చేసిన ప్రధాని మోడీ

అంగోలా అధ్యక్షుడి పర్యనటతో

సంయుక్త మీడియాసమావేశం



ఉగ్రవాదులనే కాదు.. వంతపాడేవాళ్లనూ వదలం ఉగ్రవాదులనే కాదు. వారి మద్దతుదారులనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

2లో

## షాకింగ్..రూ.7 వేలు పెరిగిన వెండి..కానీ గోల్డ్ ...

గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూ వచ్చాయి. కానీ ఆదివారం రోజు మాత్రం ఈ ధరలు స్థిరంగా ఉన్నాయి. అయితే గత వారం రోజుల్లో వీటి ధరల పరిస్థితి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ

## నంబర్ వన్

రైతులకు అందిస్తున్న సహకారంతోనే సాధ్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



2లో



## హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

కులగణన అంతా తప్పుల తడక వ్యవహారం మండిపడ్డ ఎంపి డికె అరుణ

బీసీలు, ఓసీలకు నిజమైన న్యాయం చేసేది కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రమేనని చెప్పారు.

2లో

42సార్లు ఢిల్లీ వెళ్లినా

## ఏం లాభం

ఉపాధి కూలీల పనిదినాలు తగ్గినా పట్టింపేది

సిఎం రేవంత్‌పై హరీశ్‌రావు విమర్శలు



2లో

తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని.. వారి జీవితాలతో ఆడుకుంటుందని హరీష్‌రావు మండిపడ్డారు.

దిగుమతులపై పూర్తి నిషేధం విధింపు



## పాక్‌పై భారత్ మరో ఆర్థిక దాడి

**న్యూఢిల్లీ,మనసాక్షి:**దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని, పాకిస్థాన్‌పై ఆర్థికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత ప్రభుత్వం పాక్ దిగుమతులపై నిషేధం విధించింది. ఈ నిషేధం విదేశీ వాణిజ్య విధానం 2023లో భాగంగా కొత్త నిబంధనగా చేర్చబడింది. దీనిలో భాగంగా, పాకిస్థాన్ నుంచి ఉత్పత్తులు దిగుమతి చేసుకునే లైసెన్సులను రద్దు చేయడం, ఎలాంటి సరుకుల ప్రవేశానికి అనుమతి ఇవ్వకపోవడం వంటి చర్యలు తీసుకున్నారు. ఈ నిషేధంతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది. భారత ప్రభుత్వం ఈ చర్యను అంతర్జాతీయ వేదికలపై కూడా న్యాయబద్ధంగా నిలబెట్టే ప్రయత్నం చేయనుంది. ఉగ్రవాదంపై పోరులో ఇది ఒకటని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్–పాకిస్థాన్ సంబంధాలు మరింత దిగజారాయి. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి అన్ని రకాల దిగుమతులపై నిషేధం విధించింది. జాతీయ భద్రత, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిషేధం వెంటనే అమలులోకి వచ్చింది. రవాణాలో ఉన్న వస్తువులతో సహా పాకిస్థాన్ నుంచి వచ్చే లేదా ఆ దేశం నుంచి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులపై వర్తిస్తుంది. ఈ క్రమంలో పాకిస్థాన్ లో లేదా అక్కడి నుంచి ఎగుమతి చేయబడిన అన్ని వస్తువుల దిగుమతి లేదా రవాణా అన్నీ కూడా వెంటనే నిషేధించబ డతా యి. ఈ నిషేధానికి మినహాయింపు కోసం భారత ప్రభుత్వం ముందస్తు అనుమతి అవసరమని వాణిజ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో దాయాదితో అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న భాతర్ ఇలా మరో గట్టి షాకిచ్చింది. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది.పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా సరే పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతించబోం. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే.

. భారత ప్రభుత్వంనుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. భారత్–పాకిస్థాన్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ–వాఘా సరిహద్దు. ఇప్పటికే దాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇక,

2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం.



2లో

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

అవినీతికి చోటు లేకుండా కఠిన చర్యలు

పేదలకే ఇళ్లు దక్కేలా చూసే బాధ్యత మీదే

యువ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి సూచన

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

హైదరాబాద్: పేదోడి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది రూ.22వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. పైలట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోందని అన్నారు. మిగిలిన గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ లో శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. హౌసింగ్ కార్పొరేషన్‌లో 350 మంది ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆరు రోజులపాటు అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికెట్లు- అందజేశారు. అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్ -2లో పనిచేస్తున్న10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్-1కి, సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న 11 మందికి గ్రేడ్-2 పదోన్నతులు కల్పించింది. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందరభంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదన్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు సక్సెస్ కావాలంటే యువ ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. ఇందిరమ్మ ఇండ్లకోసం శిక్షణ పూర్తిచేసుకున్న 390 మందియువ అసిస్టెంట్ ఇంజనీర్లంతా ఇందుకు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలా? ఇతర పార్టీలా అన్ని పార్టీల వారికి.. అర్హులైన పేదలకే ఇండ్లు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవారికి అందాలంటే అది పేద కుటుంబాల నుంచి వచ్చిన యువ ఇంజనీర్లకే తెలుసన్నారు. ఎవరూ ప్రలోభాలు పెట్టినా డబ్బుకు ఆశపడొద్దని హెచ్చరించారు. 600 చదరపు మీటర్లు లోపే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని.. ఎక్కు జాగలో ఇళ్లు కడితే తర్వాత వచ్చే డబ్బులు ఇవ్వబోమన్నారు.

మొత్తం నాలుగు దశల్లో నిధులు విడుదల అవుతుందన్నారు పొంగులేటి. గ్రౌండ్ లెవల్ లో ప్రతి ఇంటిని పరిశీలించే బాధ్యత యువ ఇంజనీర్లదేనన్నారు. ప్రతి సోమవారం అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిధులు రిలీజ్ చేస్తామన్నారు. డబ్బులు రిలీజ్ చేశాక ప్రతి ఇంటిని పరిశీలిస్తామని చెప్పారు.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలు కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ..ప్రజల ఆకాంక్ష మేరకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన తప్పుడు కులగణన అని విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే కులగణన అనే మాట మాట్లాడారని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయిందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మొట్టమొదటి కులగణన 1931లో జరిగిందని ఎంపీ డీకే అరుణ గుర్తుచేశారు. ముస్లింలని బీసీ జాబితాలో చేర్చడం అంటే నిజమైన బీసీలను మోసం చేయడమేనని అన్నారు. 2026లో డీ లిమి-టె-షన్‌కి వెళ్తున్నామని అన్నారు. బీసీలు, ఓసీలకు నిజమైన న్యాయం చేసేది కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రమేనని చెప్పారు. జనగణనతో పాటు-కులగణన చేయడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక గొప్ప సంకల్పమని అన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి ఒక పేద కుటు-ంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలతో పాటు-గా ఎంపీలకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కోటాను కల్పించాలని.. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని ఎంపీ డీకే అరుణ వెల్లడించారు.

## 42సార్లు ఢిల్లీ వెళ్లినా ఏం లాభం

హైదరాబాద్:ఉపాధి హామీ పనిదినాలు 2024-25 సంవత్సరానికి 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు తగ్గాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 సార్లు దిల్లీ వెళ్లినా ఉపాధి పనిదినాలు సగం తగ్గాయని విమర్శించారు. విషయం తెలిసినా కాంగ్రెస్, భాజపా ఎంపీలు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే కూలీల పనిదినాలు పెంచాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా.. తెలంగాణకు సాధించింది ఏం లేదని హరీష్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని.. వారి జీవితాలతో ఆడుకుంటు-ందని హరీష్‌రావు మండిపడ్డారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం రెండు కలిసి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని హరీష్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి మంజూరైనా నరేగా పనిదినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించడం శోచనీయమని అన్నారు. 2024-25లో రూ.12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా, ఈ సంవత్సరం కేవలం రూ. 6.5 కోట్ల పనిదినాలకే పరిమితం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నరేగా పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 4 నెలల వేతనాలు చెల్లించాలని హరీష్‌రావు కోరారు.

## పత్తి కొనుగోళ్లలో రూ.3వేల కోట్ల కుంభకోణం

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణ**

హైదరాబాద్:పత్తి కొనుగోళ్లలో రూ.3వేల కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల కుంభకోణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హస్తం ఉందని విమర్శించారు. రైతులు క్వింటాకు రూ.2వేలు నష్టపోయారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం నాడు మీడియాతో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రైతు దగ్గర క్వింటాల్ పత్తిని రూ.5వేలకు కొనుగోలు చేసి... బ్రోకర్లు రూ.7 వేలకు పైగా దండుకున్నారని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు.పత్తి కొనుగోళ్ల వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. సీసీఐ, మార్కెటింగ్ అధికారులు పత్తి రైతులను మోసం చేశారని ఆరోపించారు. పత్తి కొనుగోళ్లను సీసీఐ ఆలస్యం చేయటంతోనే.. రైతులు నష్టపోయారని చెప్పారు. కేవలం 20శాతం మందిరైతులే సీసీఐకు పంటను అమ్ముకున్నారని అన్నారు. మిగిలిన పంటను కాంగ్రెస్ నేతలు సిండికేట్‌గా ఏర్పడి.. సీసీఐకు అమ్ముకున్నారని ఆరోపణలు చేశారు. దీపావళి సందర్భంగా.. హైదరాబాద్‌లోని ఓ హోటల్లో సీసీఐ అధికారులు, ట్రేడర్ల మధ్య జరిగిన రహస్య సమావేశంలో ఈ కుంభకోణానికి బీజం పడిందని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణలు చేశారు.

# మానవాళి మనుగడకు ఉగ్రవాదం ప్రమాదకరం



న్యూఢిల్లీ: మానవాళి మనుగడకు టెర్రరిజం అతి ప్రమాదకరమైనదని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు అని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోదీ ప్రస్తావించారు. రెండు దేశాలు ఉగ్రవాదం తగదని నమ్ముతున్నాయి. టెర్రరిజాన్ని సపోర్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న దృఢనిశ్చయంతో ఉన్నాము. సరిహద్దుల దగ్గర టెర్రరిజాన్ని అరికట్టడంతో మాకు సహకరిస్తున్నందుకు అంగోలాకు కృతజ్ఞతలు అని ప్రదాని తెలిపారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడి నేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. అందుకు ఆ దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం అని మోదీ పునరుద్ఘాటించారు. ఇటీవల బిహార్‌లో జరిగిన కార్యక్రమంలోనూ మోదీ పహల్గాం దాడి గురించి ప్రస్తావిస్తూ గట్టి హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా అని అన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టు-ముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం .. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే దిశలో చర్యలు మొదలెట్టింది. సరిహద్దుల దగ్గర యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదం గురించి తరచుగా స్పందిస్తూనే ఉన్నారు. శనివారం కూడా ప్రధాని మోదీ ఉగ్రవాదంపై మాట్లాడారు. ఉగ్రవాదులపై .. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కో రాక సందర్భంగా ఆయనతో ఢిల్లీలో ఉమ్మడి ప్రెస్ కాన్ఫిరెన్స్ జరిగింది. ఈ ప్రెస్ కాన్ఫిరెన్స్ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దాదాపు రెండు దేశాలు 40 ఏళ్లుగా భాగస్వామ్యంలో కలిసి ముందుకు నడుస్తున్నాయి. అంగోలా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నపుడు.. ఇండియా నమ్మకం, స్నేహంతో అండగా నిలిచింది. ఆఫ్రికన్ దేశాల నుంచి మాకు గత పదేళ్లు ఎంతో వేగవంతమైన సహకారం అందింది. వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఎనిమిది దేశాల్లో ఒకేషనల్ -ట్రైనింగ్ సెంటర్లను తెరిచాము. ఓ ఐదు దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో సహకరిస్తున్నాం.. ఆఫ్రికాలో 17 కొత్త ఎంబసీలను తెరిచామని అన్నారు.

## ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ నంబర్ వన్

హనుమకొండ: ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల వైఖరికి ధాన్యం దిగుబడే నిదర్శమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని చరిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీకి మించిన సంక్షేమ పథకం మరొకటి లేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెరిఫై చేసిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని.. రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో చారిత్రక, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సన్న బియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్న ప్రభుత్వం తమదేనని.. ఎంత ఖర్చైనా సరే నిరుపేదలకు సన్న బియ్యం అన్నం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్, వ్యవసాయ శాఖలకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఇందులో భాగంగానే ఏ రాష్ట్రంలో పండని విధంగా తెలంగాణలో వానాకాలం, యాసంగిలో వరి పండిందని తెలిపారు. రాష్ట్రంలో 2.80 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని.. రెండు సీజన్లలో

రబీ, యాసంగి సీజన్లలో సన్న ధాన్యానికి రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ఇస్తోందని.. ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐకు ధాన్యం అమ్మే రాష్ట్రాల్లో తెలంగాణే

ముందు వరుసలో ఉందని తెలిపారు. దేవాధుల ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్‌ను కూడా సందర్శించామన్నారు. భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులను, సుందరీకరణ పనులను భారీ స్థాయిలో చేపట్టామని తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేస్తున్నట్లు- తెలిపారు. ఈ శాఖలోని అన్ని సమస్యలను రెండేళ్లలో అధిగమిస్తామన్నారు. సీతమ్మసాగర్‌కు 68 టీ-ఎంసీల గోదావరి జలాలు కేటాయించామన్నారు. కేంద్రంతో అనేక సార్లు చర్చించి నీటి వాటాను దక్కించుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని పెండింగ్

ప్రాజెక్టులను ఈ సీజన్‌లో పూర్తి చేస్తామన్నారు. రైతులకు నీరందించి సాగును సస్యశ్యామలంగా చేయడానికి కృషి చేస్తిన్నామన్నారు. రైతన్నల అద్భుతంగా పంటలను పండించారన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రైతుల నుంచి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు అందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు.


## రహదారుల అభివృద్ధితోనే పెట్టుబడులు సాధ్యం



హైదరాబాద్: రహదారులు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 5న కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తెలంగాణకు రానున్నారు. 5,416 కోట్ల రూపాయలతో 26 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్నాయి. నితిన్ గడ్కారీ అదిలాబాద్ , హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. రహదారుల అనుసంధానం అన్నింటికంటే ముఖ్యమైనదని చెప్పారు. వాజ్ పేయీ హయాంలో స్వర్ణ చతుర్భుజి పథకాన్ని తెచ్చారని, రోడ్ల నిర్మాణంపై లక్షల కోట్లు ఖర్చు ఎందుకని ఆనాడు కొందరు విమర్శించారని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని, కనెక్టివిటీ- కోసం మోడీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చుపెడుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్- శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్లు నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. హైదరాబాద్- విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. గత 10 సంవత్సరాలలో జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, అన్ని రాష్ట్రాలరాజధానులను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడానికి కేంద్రం కృషి చేస్తున్నది. ఈ నిర్మాణం వెనుక ఉన్న ముఖ్యమైన అంశం తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ. 2014 వరకు రాష్ట్రంలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ప్రస్తుతం 5,200 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ విస్తరణ తెలంగాణలోని 32 జిల్లా

కేంద్రాల గుండా జాతీయ రహదారుల అనుసంధానానికి తోడ్పడిందని అన్నారు. హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా ప్రయాణానికి సంబంధించిన దూరం తగ్గించబడుతుంది. దీనితో పాటు-, హైదరాబాద్-విజయవాడ మధ్య జాతీయ రహదారికి 6 లేన్‌ల నిర్మాణం కూడా జరుగుతుందని ఆయన చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో కొన్ని చోట్ల భూ సేకరణ సమస్యలు తలెత్తుతున్నాయి. భూ సేకరణ ఆలస్యం అయితే, నిర్మాణం కూడా ఆలస్యం అవుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఎంత త్వరగా భూమి సేకరించబడితే, అంత త్వరగా రహదారుల నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వేలాదిమంది కోట్లతో వందల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరుగుతుంది. తెలంగాణకు సంబంధించి 5 ప్రధాన కారిడార్ల నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని కిషన్ రెడ్డి తెలిపారు.

# పెరుగుతున్న నిత్యావసర ధరలు



పడుతున్నారు. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పుల ధరల్లో పెరుగుదల అధికంగా ఉంది. కరోనా సమయంలో ధరలు భారీగానే పెరిగినా తర్వాత కాస్త నెమ్మదించాయి. కొంతకాలంగా నిలకడగా సాగుతున్నాయి. గతంలో 3 నెలలకు రూ.333 ఉండే రీఛార్జ్.. ఇప్పుడు రూ.666కు చేరింది. దీనికి తోడు వై-ఫై రూపంలో నెలకు రూ.500 వరకు అదనపు భారం తప్పట్లేదు. కేబుల్ టీవీ ఖర్చు రూ.250 వరకు అదనం. ఒక్కో ఓటీటీ ఛానెల్‌కు సగటున రూ.500 చొప్పున నాలుగు తీసుకున్నా.. రూ.2 వేలు. అంటే నెలకు రూ.166 చొప్పున ఖర్చవుతుంది. ఒక్కో కుటుంబంపైనా మొబైల్, కేబుల్ బిల్లుల రూపంలోనే నెలకు రూ.2వేల వరకు అవుతోంది. వై-ఫై, ఓటీటీ తీసుకున్న కుటుంబాలకు నెలకు రూ.1,000 చొప్పున తప్పట్లేదు. 2019 మధ్యలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.600 వరకు ఉంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.950అయింది. అప్పటితో పోలిస్తే రాయితీ కూడా తగ్గిపోయింది. రూ.15 చొప్పునే నామమాత్రంగా ఇస్తున్నారు. నెలకు ఒక సిలిండర్ లెక్కన చూస్తే.. ఒక్కో కుటుంబంపై రూ.372 చొప్పున భారం పడుతోంది. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించైతే చెప్పనక్కర్లేదు. చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులకు ద్విచక్రవాహనం భారమైపోయింది. నెలకు సగటున 25 లీటర్ల పెట్రోల్ లెక్కన చూసినా రూ.1,100 వరకు ఖర్చు పెరిగింది. 2019లో రూ.75లోపు ఉన్న పెట్రోల్ ధర.. ప్రస్తుతం రూ.121 వరకు చేరింది. లీటరుకు రూ.45కు పైగానే పెరిగింది. ఇంజిన్ ఆయిల్ ధర రూ.300 నుంచి రూ.500కు చేరింది. ఇప్పుడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మరింత ఎగిశాయి. బ్రాండెడ్ టీపొడి ధర గతంలో కిలో రూ.540 ఉండేది. ప్రస్తుతం రూ.780 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, యాలకులు, తులసి, అశ్వగంధ వంటి ఉత్పత్తులతో తయారయ్యే ఒక సంస్థ టీ పొడి.. 2019లో రూ.380 ఉండేది. ప్రస్తుతం రూ.560కి చేరింది. లీటర్ పాల ధర గతంలో రూ.55 నుంచి రూ.58 మధ్య ఉండేది. ఇప్పుడు సగటున రూ.64 నుంచి రూ.68 వరకు ఉంది. నెలకు 30 లీటర్లకు రూ.300 అదనంగా ఖర్చవుతోంది. సబ్బులు, డిటర్జెంట్ ఉత్పత్తుల ధరలూ.. 30 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వీటికి తోడు ఇంట్లో వాడే ఒంటి సబ్బులు,ఫేస్‌క్రీమ్, షాంపూ ధరలూ రెట్టింపయ్యాయి. పాత్రలు కడిగే సబ్బు ధర మూడేళ్ల కిందట రూ.45 ఉంటే ఇప్పుడు అది 51 శాతం పెరిగి.. రూ.68కి చేరింది. టూత్‌పేస్ట్ ధర 2019లో రూ.79 ఉంటే.. ఇప్పుడు రూ.96 రూపాయలకు పైగానే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల వస్తువులపైనా ధరలు పెరిగాయి.

## తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు

హైదరాబాద్: తెలంగాణలో వాతావరణం ఒక్కోలా మారిపోతుంది. అప్పటి వరకు వేడి గాలులు, ఎండవేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు సాయంత్రం కాగానే చల్లటి వాతావరణం ఉపశమనాన్ని ఇస్తోంది. అంతేకాకుండా ఉన్నట్టుండి వర్షాలు కూడా పడుతున్నాయి. ఉదయం ఎండగా ఉంటూ.. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ఇదిలా ఉండగా.. తెలంగాణలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటనచేసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు ముంచెత్త

నున్నట్లుపేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం పూట ఎండలు దంచికొట్టినప్పటికీ సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. ఈదురుగాలులతో కూడిన వర్షం పడనున్నట్లు- వెదర్ రిపోర్ట్ చెబుతోంది. రాష్ట్రంలో ఏయే జిల్లాలో వర్షాలు పడతాయనే విషయాన్ని కూడా వాతావరణ వాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ నల్లగొండ, వరంగల్, జనగాం, సూర్యాపేట, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమంగా ఉండగాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలకు రైతులు అల్లాడిపోతున్నారు. ఇటీ-వల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం కురవగా.. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రాకముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు బాధ వర్ణనాతీతమనే చెప్పుకోవాలి. ఈదురుగాలలు, ఉరుములు, మెరుపులతో పాటు- వడగళ్ల వర్షంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది.

## కేంద్రం కులగణన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం విజయం: భట్టి



ఖమ్మం): కేంద్ర ప్రభుత్వం కులగణనపై తీసుకున్న తాజా నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయానికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని మల్లన్నపాలెం గ్రామంలో రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిగా కులగణన చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టు-కుని ప్రభుత్వం అన్ని నిర్ణయాల్లో కులగణనను పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. కులగణన సర్వే ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాహుల్ గాంధీ

భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలన్న డిమాండ్ చేసిన సంగతి ఆయన గుర్తు చేశారు. కానీ అప్పట్లో కేంద్రం స్పందించకపోయినప్పటికీ, ఇప్పుడు ప్రజల ఒత్తిడికి తలొగ్గి కులగణన చేపట్టేందుకు ఒప్పుకున్నట్టు- తెలిపారు. ఇన్నాళ్లు రాష్ట్రంలో జరిగిన కులగణనను విమర్శించిన బీజేపీ ఇప్పుడు అదే మార్గాన్ని అనుసరించడాన్ని సానుకూల పరిణామంగా అభివర్ణించారు. రాష్ట్రంలోని బీసీలు ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అండగా నిలవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## గోవా లైరాదేవి ఆలయంలో తొక్కిసలాట

**ఆరుగురు వ్యక్తుల దుర్మరణం**

పనాజీ: గోవాలోని లైరా దేవి ఆలయ జాతరలో జరిగిన తొక్కిసలాటలో ఆరు మంది మృతిచెందారు. మరో 50 మంది గాయపడ్డారు. శిర్గావ్‌లోని ఆ ఆలయంలో ఈ ఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున... సుమారు 4 నుంచి 4.30 నిమిషాల మధ్య ఆలయంలో భక్తులు ఒక్కసారిగా ఒకరిపై ఒకరు తోసుకున్నారు. అర్ధరాత్రి అగ్నిదివ్య అనే కార్యక్రమం జరిగిన తర్వాత తొక్కిసలాట చోటుచేసుకున్నది.

జాతరలో భాగంగా ఆలయ సమీపంలోని అగ్నిగుండం చుట్టూ భక్తులు తిరుగుతూ తమ కోర్కెల్ని చెప్పుకుంటారు. అగ్ని దివ్య చుట్టు తిరగడం ఇక్కడ సంప్రదాయం. ఇక కొందరు ఆ నిప్పుల కుప్ప మీద నడుస్తారు కూడా. అయితే తొక్కిసలాట జరిగిన సమయంలో.. భక్తులు అక్కడే ఉన్నారా లేదో స్పష్టంగా తెలియదు. కానీ జనం కిక్కిరిసిపోవడం వల్ల తొక్కిసలాట జరిగినట్లు- ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

# మహిళ చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

**నారాయణపేట టౌన్,మే 03,మన సాక్షి:**



మహిళా సాధికారత కేంద్రం సింగారం ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన న్యాయమూర్తి,లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి,లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ వింధ్య నాయక్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, మహిళా చట్టాలను పూర్తి స్థాయిలో అమలు పరుచుటకు అన్నిమహిళా సంస్థలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతీయ మహిళా కేంద్రీకృత చట్టాలు, మహిళా కేంద్రీకృత నిబంధనలపై నేరాలుగా పరిగణించబడే చర్యలు, చట్టవిరుద్ధమైన లోపాలు, ప్రాథమిక హక్కులు , శిక్షలు, సాధారణ మినహాయింపులు, నేరపూరిత కుట్ర, స్త్రీ,పిల్లలపై నేరాలు, కిడ్నాప్, దోపిడీ, వంటి ఏదైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలు , అత్యాచారం, లైంగిక వేధింపులు, స్త్రీ నమ్రతను అవమానించడం వంటి ఐపిసి సెక్షన్స్ మరియు బిఎన్ఎస్ కొత్త నిబంధనలను గురించి వివరించారు. బి.ఎన్.ఎస్ లో 20 కొత్త నేరాలను చేర్చారన్నారు. రద్దు చేయబడిన ఐపీసీ లోని 19 నిబంధనలను తొలగించారని, 33 నేరాలకు జైలు శిక్షను పెంచారన్నారు. 23 నేరాలకు తప్పనిసరి కనీస శిక్షను ప్రవేశపెట్టారని, ఆరు నేరాలకు సమాజ సేవ శిక్షను ప్రవేశపెట్టా రన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ మండలి చైర్మన్ అశోక్ శ్యామల చిల్డ్రన్స్ చట్టాలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ బి.ఎన్.ఎస్ చట్టం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, టోల్ ఫ్రీ 15100 గురించి వివరించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి మహిళ చట్టాలపై , సీనియర్ న్యాయవాది నందు నామాజీ బాల్య వివాహాలు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సరోజినీ, చిల్డ్రన్ హోమ్ సూపరిండెంట్ శ్వేత, డీసీపీవో తిరుపతయ్య, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ నర్సింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ, చెన్నప్ప షీ–టీమ్, సఖి సెంటర్ అడ్మిన్ క్రాంతిరేఖ, భరోసా కోఆర్డినేటర్ ప్రమీల, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ నర్సిములు, సాయి, సంధ్య ఆయా విభాగాల టీమ్ సభ్యులు మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కాకర్ల భీమయ్యకు డాక్టరేట్ అవార్డు

**నారాయణపేట టౌన్,మే 03,మన సాక్షి:**




జిల్లా కేంద్రానికి చెందిన అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య గత 20సంవత్సరాల నుండి సోషల్ సర్వీస్ సమాజంలో అయన అందించిన సామాజిక దార్మిక సేవాలను గుర్తించి తమిళనాడు కన్యాకుమారి లోని గ్లోబల్ హుమన్ పీస్ యూనివర్సిటీ వారు శనివారం కన్యాకుమారి వివేకానంద కేంద్ర క్యాంపస్ లో డాక్టరేట్ అవార్డును యూనివర్శిటి చేర్మెన్ మ్యానుల్ వైస్ చేర్మెన్ వెంకటేషన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు సోషల్ సర్వీస్ సామాజిక కార్యక్రమలద్వారా పలు సేవా కార్యక్రమాలు అందించడంతో కాకర్ల భీమయ్యను ప్రత్యేకంగా అభినందించి ప్రతి ఒక్కరు కాకర్లను ఆదర్శంగా తీసుకోని సమాజ సేవాకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన కోరారు. కాకర్ల భీమయ్య మాట్లాడుతూ పేద కుటుంబంలో వివాహం చేసుకున్న పుస్తెలు మెట్టెలు అందించి సామాజిక సేవ ప్రారంభించిన ఆయన వేసవిలో తాగునీటి సౌకర్యం సురేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు, పట్టణంలోని పలు వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు గుర్తించి యూనివర్సిటీ వారు డాక్టర్ అందజేసినట్లు కాకర్ల భీమయ్య తెలిపారు.ఈ సామాజిక కార్యక్రమాలు ఇలాగే కొనసాగించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని ఆయన తెలిపారు. డాక్టర్ అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.కాకర్ల భీమయ్యకు డాక్టర్ అవార్డు రావడం పట్ల పట్టణంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# పరిశుద్ధ కార్మికులకు అండగా ఉందాం..!



**శేరిలింగంపల్లి,మే 03,మన సాక్షి:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల శ్రీకృష్ణ కాలనీలో జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేసిన గచ్చిబౌలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎల్. వెంకటేష్ ముదిరాజ్. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల దినోత్సవం సందర్భంగా పరిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉదయమే లేచి చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను ఎక్కడికి అక్కడ శు భ్రపరుస్తూ వారు పనిలో నిమగ్నమై పోతారు వారిని గౌరవించుకోవడం బాధ్యత అంటూ తెలియజేశారు.

# పయల మల్లేష్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ




**శంషాబాద్, మే 03, మన సాక్షి:**

నర్కూడ గ్రామానికి చెందిన పయల మల్లేష్ అనారోగ్యంతో పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మల్లేష్ కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుండి రూ. 2,50,000/– విలువైన ఎల్ఓసిని ఎమ్మెల్యే ప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వ సహాయం అందేలా చూస్తాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రతి బడుగు, బలహీన వర్గానికీ అండగా నిలబడతామని, పయల మల్లేష్ త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గణేష్ గుప్తా, చంద్ర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వి రాజు, చందనవెల్లి శ్రీనివాస్, నీరటి శేఖర్,గుండాల విశ్వనాథం,పర్వతం ప్రభు, నరసింహ, పయల మల్లేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు పిఆర్వోగా ఎంఏ పాష ఎన్నిక

**ఆమనగల్లు,మే 03,మన సాక్షి:**



లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు 2009–10 నుండి 2025 –26 సంవత్సరం గాను క్లబ్ పిఆర్వోగా వరుసగా 16వ సారి ఎంఏ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలపై విస్తృత పరిచినందుకు ఆయన ఈ ఎన్నిక ఏకగ్రీవైంది. రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థాయిలో ఎన్నో అవార్డులు పిఆర్వోగా ఆయన సొంతం చేసుకున్నారు.లయన్స్ క్లబ్ చేపట్టే ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లయన్స్ క్లబ్ సేవలు అందించడమే పేదలకు అందించే లక్ష్యంగా కృషి చేసినట్లు పాషా తెలిపారు.ఈ సందర్భంగా పిఆర్ఓ పాషా మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అవకాశాన్ని కల్పించిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి చెన్న కిషన్ రెడ్డి,ఎల్సి ఎఫ్ ఏరియా లీడర్ సందడి నరేందర్ రెడ్డి,రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పెటల్ చైర్మన్ డాక్టర్ వి దామోదర్ రెడ్డిగ, మాజీ గవర్నర్ జూలూరి రమేష్ బాబు,లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ వీరబొమ్మ బిక్షపతి, లకు,కృతజ్ఞతలు తెలిపారు.

# మోడల్ స్కూళ్లలో 5 నుంచి ఇంటర్ ప్రవేశాలు

**శంకర్‌పల్లి,మే 03,మన సాక్షి:**



శంకర్‌పల్లిలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు ఈ నెల 5వ తేదీ నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ శోభారాణి. తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో మొత్తం4(ఎంపీసీ, బైపిసి, సిఇసి, ఎంఇసి) గ్రూపులు కలవు. ప్రతి గ్రూప్ లో 40 సీట్లచొప్పునమొత్తం160 సీట్లుకలవు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అందరూ అప్లై చేసుకోవడానికి అర్హులు. ఎస్ఎస్ సిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయటం జరుగుతుంది. ఎంపికైన విద్యార్థుల జాబితాను 26న వెబ్‌సైట్‌లో ఉంచుతామని, 27 నుంచి 31వ తేదీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, జూన్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. విద్యార్థులు http:// 183.82.97.97/mstg ద్వారా ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కూడా సీట్లు కలవు. ఆసక్తి గల విద్యార్థులు అందరూ జాయిన్ కాగలరు.

# సింగరేణి కార్మికుడి కుమారుడికి ఓయూ డాక్టరేట్

**నాచారం,మే 03,మన సాక్షి:**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలో సింగరేణి గనిలో కార్మికుడిగా పని చేసినటువంటి తోట సదానందం విజయలక్ష్మి దంపతుల కుమారుడు తోట శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీ లో డాక్టరేట్ పొందాడు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో "డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ కోఆర్డినేటెడ్ కంట్రోల్ ఆఫ్ మల్టీ లెవెల్ ఇన్వెర్టర్స్ ఇన్ ఏ డిస్ట్రిబ్యూటెడ్ ఎనర్జీ సిస్టం" అంశం పై ప్రొఫెసర్ పి సతీష్ కుమార్, ప్రొఫెసర్ కె కృష్ణవేణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేసి గౌరవ డాక్టరేట్ పొందాడు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపకులు, కుటుంబ సభ్యులు పలువురు విద్యార్థులు ,స్నేహితులు శ్రీనివాసు ను అభినందించారు.

# ఫామ్ హౌస్ లో కేసీఆర్.. బోట్ క్లబ్ లో భాస్కరరావు

## కాంగ్రెస్ నాయకుల తీవ్ర ఆరోపణలు

**మిర్యాలగూడ , మే 3, మన సాక్షి :**



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉంటే మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే బోట్ పార్కులో ఉంటారనే విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అని కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం స్థానిక మినీ రవీంద్రభారతిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ వాళ్లు ఇదే వేదికగా శాసనసభ్యులు బిఎల్ఆర్ పై అవాకులు చవాకులు పేలుతూ మాజీ శాసనసభ్యులు భాస్కర్ రావు చేసినటువంటి అవినీతి పనులను కప్పిపుచ్చుకోవటానికి మసి పూసి మారేడు కాయ చేయాలనే ఉద్దేశంతో వారు నోటికి వచ్చినట్లుగా మాట్లాడటం జరిగిందన్నారు. మినీ రవీంద్ర భారతి పేరుని ఎలాంటి అనుమతులు లేకుండా వారి ఇష్టారాజ్యంగా కెసిఆర్ కళాభారతిగా నామకరణం చేయడం ఎంతవరకు సమంజసమో తెలపాలన్నారు. అదేవిధంగా ఈ మినీ రవీంద్ర భారతి 2006లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ జైపాల్ రెడ్డి తీసుకు వచ్చినటువంటి నిధులతో శంకుస్థాపన చేసుకుని దాని నిర్మాణ ప్రారంభం చేయడం జరిగిందని ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి 1.30 కోట్లు ఫండ్ తీసుకురావడం జరిగిందన్నారు. మిగిలిన మొత్తాన్ని టి ఎఫ్ యు ఐ డి సి నిధుల ద్వారా తీసుకువచ్చి దాదాపుగా 9 కోట్ల వ్యయంతో ఈ మినీ రవీంద్రభారతిని నిర్మాణం చేయడం జరిగిందన్నారు. దీనిలో మొదటగా కాంట్రాక్ట్ తీసుకున్నటువంటి వారు నష్టపోయే విధంగా బిఆర్ఎస్ పార్టీ వాళ్ళు బిల్లు రాకుండా చేసి వారిని దివాలా తీయించి ఆ వర్కులను భాస్కర్ రావు వారి బినామీలకు ఇప్పించి ఎస్టిమేట్లను పలుమార్లు మార్చి బిల్లులు ఎక్కువగా రాయించుకొని నాసిరకం పనులు చేసినటువంటి ఘనత మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు దేనిని అన్నారు. భాస్కర్ రావు నిన్న మాట్లాడుతూ సెంట్రల్ ఏసి చేయించానని చాలా గొప్పగా చెప్పుకున్నారని కానీ, కూలర్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ పేరుని పెట్టి బిల్లులు పాస్ చేయించుకోవాలని దుర్దేశంతో కేసీఆర్ కళాభారతిగా పేరు పెట్టారని అధికారికంగా దానికి ఎలాంటి ఆనవాళ్లు లేవని అది కేవలం మినీ రవీంద్ర భారతి గానే పిలవబడుతుందన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు క్యాంప్ ఆఫీస్ ఆయన కట్టించిందని అందులో ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఉండవద్దని అవాకులు చివాకులు మాట్లాడారని, అయితే క్యాంప్ ఆఫీస్ అనేది కేసీఆర్ అబ్బ సొత్తు గానీ భాస్కరరావు అబ్బ సొత్తు గానీ కాదని అది తెలంగాణ ప్రజల ఆస్తి అని ఎమ్మెల్యేగా ఎవరు ఉంటే వారు అందులో ఉండే అధికారం ఉందన్నారు. ఆ మాత్రం ఇంకిత జ్ఞానం కూడా లేని భాస్కరరావు మిర్యాలగూడ పేరు కూడా మార్చుతారని అడ్డగోలుగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఆయన ఆంధ్ర ప్రాంతంలోని నాదెండ్ల నుండి వచ్చి ఇక్కడ జానా రెడ్డి సూట్ కేసులు మోస్తూ అక్కడి మాటలు ఇక్కడ ఇక్కడి మాటలు అక్కడ చేరవేస్తూ అందరి వాడైనా జానారెడ్డి ని మోసం చేసి మాయమాటలు చెప్పి ఎమ్మెల్యే అయి గెలిపించిన పార్టీని నమ్మి సీటు ఇచ్చిన పెద్దలు జానా రెడ్డిని మోసం చేసిన విషయం తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉంటే మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు బోట్ క్లబ్ లో ఉండే విషయం మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని, మన నాయకుడు ఎంపీ రఘువీర్, ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు పిచ్చి లేసి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మరొకసారి ఇలా మాట్లాడితే ఈ ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని వారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, మాజీ ఎంపీటీసీ బెజ్జం సాయి, జడ్పిటిసి నాగు నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిలి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, బండి యాదగిరి రెడ్డి, రుణాల్ రెడ్డి, కొమ్మన నాగలక్ష్మి, పందిరి అనిత, ఆలగడప గిరిధర్, జావీద్, గుంజ శ్రీను, చల్లా వెంకన్న, గంధం రామకృష్ణ, మల్లాల అమృత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలు బంటు లక్ష్మీనారాయణ, మేకల శ్రీనివాస్, బాసాని గిరి, గోదాల జానకి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ఆమనగల్లు,మే 03,మన సాక్షి:**



ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కళ్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 49 కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను లబ్ధి దారులకు రైతు వేదికలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మండల రెవెన్యూ అధికారిని ఏఎంసీ చేర్మెన్ యట గీత ఏఎంసీ వైస్ చేర్మెన్ భాస్కర్ రెడ్డి టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మీ పథకం గొప్ప వరమన్నారు.ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మామయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెలగమల్ల జగన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహం, కేఎన్ఆర్ సేవాదనం వ్యవస్థా పకుడు మెకానిక్ బాబా,శ్రీపతి శ్రీనివాసరెడ్డి,విజయ్, గుర్రం కేశవులు,కృష్ణా నాయక్, ఖాదర్ ఖాద్రి,ఖాదర్, ఎన్ఎస్యుఐ జిల్లా ఎండి ఫరీద్, కండే సాయి, అలీమ్,నాజర్, మహేష్,లు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన కమిషనర్

**శేరిలింగంపల్లి,మే 03,మన సాక్షి:**



జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావు ఆయా శాఖ అధికారులతో కలిసి గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు జరుగుతున్న ఫేజ్–2 శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత సర్వీస్ రోడ్డు పూర్తవుతుందని ప్రాజెక్ట్ ఇంజనీర్లు ఆయనకు తెలియజేశారు. హెచ్ –సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఖాజాగూడ జంక్షన్‌లోని ప్రతిపాదిత ఫ్లైఓవర్ అండర్‌పాస్ స్థలాన్ని కూడా కమిషనర్ సందర్శించారు. మల్కం చెరువు వద్ద, పారిశుధ్యం వీధి కుక్కల బెడద గురించి వాకర్ల ఫిర్యాదులకు ప్రతిస్పందనగా, సమస్యలను పరిష్కరించాలని ప్రజల భద్రత సౌకర్యాన్ని నిర్ధారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సరస్సులోకి వర్షపు నీరు ఎలా వస్తుందో కూడా ఆయన ఆరా తీశారు. దుర్గం చెరువు మరియు సమీప నివాస ప్రాంతాల నుండి నీరు వస్తున్నట్లు అధికారులు వివరించారు. సరస్సులోకి వర్షపు నీరు రాకుండా నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. తనిఖీ సమయంలో, డిసి ప్రశాంతి, ఎస్ఈ శంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డిఎంహెచ్వోని కలిసిన హెల్త్ అసిస్టెంట్లు

**కురవి,మే 03, మన సాక్షి:**




మహబూబాబాద్ జిల్లా డిఎంహెచ్వో గా నూతనంగా నియమితులైన డాక్టర్ రవి రాథోడ్ ని శనివారం హెల్త్ అసిస్టెంట్లు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన డిఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు జిల్లాకి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు మిట్టకోల సత్యనారాయణ,దండే శ్రీహరి,నాయిని అనిల్,సర్దార్ బాబు,పాక రాజేందర్,రత్నాకర్, ఎలేందర్, శ్రీనివాస్ తదతరులు ఉన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

## ఆర్డీఓ రామచంద్ర నాయక్

**నారాయణపేట టౌన్,మే 03,మన సాక్షి :**



నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని ఆర్డీఓ రామచంద్ర నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో మాదకద్రవ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యా%శీ%టీ డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డి.ఎస్.పి నల్లపు లింగయ్య మాట్లాడుతూ జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలలో యా%శీ%టీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామని, జిల్లాలోని అన్ని ప్రాంతాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిషేధం పై విద్యార్థులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్ పై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టడం జరిగిందని డిఎస్పీ వివరించారు. కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా ఆబ్కారీ శాఖ అధికారులు కూడా మాదకద్రవ్యాల నిషేధంపై కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్డీఓ సూచించారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి,జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి నేతత్వంలోనూ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గతంలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించామని, ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఉన్నాయని, జూన్ లో మళ్ళీ నిర్వహిస్తామని డిఐఈఓ సుదర్శన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీవో మేఘా గాంధీ, డ్రగ్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్, ఎక్సైజ్ సీఐలు పురుషోత్తం రెడ్డి, గురువయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి భిక్షపతి, సి సెక్షన్ అధికారిని పాల్గొన్నారు. చివరగా టీ జీ యాంటి నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషేధం పై అవగాహన కల్పించేందుకు ముద్రించిన వాల్ పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు.

# విజయవంతమైన మెగా జాబ్ మేళా

## వందలాదిగా హాజరైన నిరుద్యోగ యువత

**నారాయణపేట టౌన్,మే 03,మన సాక్షి:**






భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలో శనివారం ఎస్ ఆర్. గార్డెన్ లో నిర్వహించిన మెగా జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్ అయ్యింది. భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే.రాజ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో శనివారం నారాయణపేట పట్టణంలోని ఎస్.ఆర్.గార్డెన్స్ లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నారాయణపేట జిల్లాతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. అంతకుముందు తనకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులచే డాక్టర్ కే.రాజ్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయించి కార్యక్రమాన్ని ప్రారంభింపజేశారు.

ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తాను పుట్టిన గడ్డను అభివృద్ధి చేసుకునే క్రమంలో రాజ్ కుమార్ రెడ్డి నారాయణపేటలో ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం హర్షనీయమని అన్నారు. ఇప్పటికే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ల్యాప్ టాప్ల అందజేత, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడం, అనేక దేవాలయాల పునర్మిణాలకు సహకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమంలో భాగంగా మెగా ఉద్యోగ మేళాను నిర్వహించినట్లు తెలిపారు.

**నిరుద్యోగుల నుండి భారీ స్పందన:**
భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళ కు నిరుద్యోగుల నుండి విశేష స్పందన లభించింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించడమే ఏకైక లక్ష్యంగా భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే.రాజ్ కుమార్ రెడ్డి మెగా జాబ్ మేళా ను నిర్వహించి ఎంతోమందికి ఉద్యోగాలు కల్పించడం పట్ల నిరుద్యోగుల కుటుంబ సభ్యులు, జాబ్ మేళాకు వచ్చిన అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లాలో ఉన్న నిరుద్యోగుల కోసం ఇప్పటివరకు మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయలేదని, భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి తమకు ఉద్యోగాలు కల్పించడం సంతోషంగా ఉంది అని పలువురు నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి జాబ్ మేళాను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం వివిధ కంపెనీలలో ఇంటర్వ్యూలకు హాజరై 380 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, అందులో 80 మంది నిరుద్యోగ యువతకు భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు రావడంతో నిరుద్యోగులు మురిసిపోయారు. అంతకుముందు నిర్వాహకులు వివిధ కంపనీల ప్రతినిధులను, అధ్యాపకులను, ఫౌండేషన్ సభ్యులను శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మణిమాల, వేణుగోపాల్, అంజయ్య, ఫౌండేషన్ సభ్యులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలన



**కొల్చారం, మే 03, మన సాక్షి:**

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సంబంధిత ఎంపీడీవో ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం సేకరణ, ట్యాబ్ ఎంట్రీలు, ఐకేపీ, కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి దాకా సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం సేకరించిన వెంటనే వాటి వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయాలని కలెక్టర్. సూచించారు. నాణ్యతా ప్రమాణాలు మేరకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల నుంచి నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆదేశించారు. ధాన్యం డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడేలా చూడాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు వివరాలు ట్యాబ్ ఎంట్రీ చేయని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐకేపీ, డీసీఎంఎస్, ప్యాక్స్, ఆద్వర్యంలో ఇప్పటి దాకా 2715 మంది రైతుల నుంచి 53,602 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. మొత్తం రూ. 28కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో వేశామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డిఓపిడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ రఫీక్ ఉన్నిసా, మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, ఏఈఓ నిరోషా,ఏపీఎం సుశీల్వ, ఐకేపీ సిబ్బంది యశోద సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కురుమ సంఘం నూతన అధ్యక్షునిగా వెంకటయ్య



**శంకర్‌పల్లి,మే 03,మన సాక్షి:**

రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండలం నూతన కమిటీ అధ్యక్షునిగా బండమీది వెంకటయ్యను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ కురుమలు ఐక్యంగా ఉండి ఏక తాటికి రావాలని పిలుపునిచ్చారు. మండల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు వివిధ గ్రామాల కురుమ సంఘం సభ్యులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం హక్కులు గురించి అందరూ పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాపోలు నరసింహులు, బిజెపి మండల అధ్యక్షురాలు లీలావతి భయానంద్, మోకిల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్యం, మాజీ ఎంపీపీ నర్సింలు, వైస్ ఎంపీపీ వెంకటేష్, పిల్లిగుండ్ల ఉప సర్పంచ్ ఐలయ్య, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మైపాల్, చందిప్ప మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒగ్గు మల్లేష్,జొన్నాడ మాజీ సర్పంచ్ ఐలయ్య, మాసానిగూడ మాజీ సర్పంచ్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# కురవి ఉన్నత పాఠశాలలో క్రీడా సామాగ్రి చోరీ..!

**కురవి,మే 03,మన సాక్షి:**



కొరివి ఉన్నత పాఠశాలలో నిన్న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కురవి ఉన్నత పాఠశాలలోని ఒక గది తాళం పగలగొట్టి లోపల ఉన్న క్రీడా సామాగ్రి భద్రపరిచిన బీరువాను కూడా పగలగొట్టి అందులో ఉన్న దాదాపుగా 5000 రూపాయల విలువైన క్రీడా సామాగ్రిని దొంగలించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ వహీద్ తెలిపారు . ఈరోజు వారు ఇట్టి విషయాన్ని కురవి పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేసి మరియు మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా తెలియపరిచారు.

# మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిటీ

**మల్కాజిగిరి,జిల్లా మే 03,మన సాక్షి:**



బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సలహాదారునిగా నూతనంగా నియమితులైన కోసరాజు లక్ష్మణ్, బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ మీడియా కో ఆర్డినేటర్ వెంకట రమణా రెడ్డిలు శనివారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి, తెలంగాణ బ్యాట్ అధ్యక్షులు దుద్దిల్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యాట్మింటన్ క్రీడాభివృద్ధికి మరింత కృషి చేస్తామని, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు స్పోర్ట్స్ అకాడమీ లను క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఘట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధితో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీకి తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ యువిఎన్ బాబు తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటల్లో మిల్లులకు తరలించాలి

**జగిత్యాల, మే 03,మన సాక్షి:**



యాసంగి పంటలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌హౌఅధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,హౌ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తేమ శాతం వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రికార్డు చేయాలని,తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంట ల్లోగా రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ సెంటర్లలో అవకతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తప్పవని సెంటర్ల నిర్వాహకులకుహౌతెలిపారు. ఈ కార్యక్రమంలోహౌకోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జివాకర్ రెడ్డి, డి ఆర్ డి ఓ రఘువరన్,డిసిఓ మనోజ్ కుమార్,మండల ఎమ్మార్వోలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సందర్శన వేళలో మార్పు..!

**ధర్మారం,మే 03,మన సాక్షి:**



సమీకృత జిల్లా కలెక్టరేట్లో వివిధ సమస్యల పై ప్రజలు కలెక్టర్ ను నేరుగా కలిసే సందర్శిన వేళల్లో స్వల్ప మార్పు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు కార్యాలయ పని దినాలలో సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాను అందుబాటులో ఉంటానని, వివిధ సమస్యలు, పనులు ఉన్న సందర్శకులు, ఫిర్యాదుదారులు, ప్రజలు ఆ సమయంలో నేరుగా తనను కలవోచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కు వివిధ సమస్యలపై దరఖాస్తులు సమర్పించాలనుకునే వారు విజిటింగ్ సమయంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ కు రావాలని, మిగిలిన సమయాల్లో వచ్చి, వేచి ఉండి తమ సమయాన్ని వృథా చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# భారతీయ కళలు మహోన్నతమైనవి

## పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,మే 03,మన సాక్షి:**

కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఎస్.వీ. జీ. కళావర్షిణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్, మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ యోగా కేంద్రంతోపాటు మామ్స్ టచ్ పేరిట ఏర్పాటు చేసిన పసి పిల్లల సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా పీఏసీ , ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ కళలు మహోన్నతమైనవి అని, పిల్లలకు చిన్నప్పటి నుంచే సంప్రదాయ, శాస్త్రీయ నృత్యకళల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. భారతీయ వారసత్వ సంపదలైన శాస్త్రీయ సంగీతం, నృత్యం యోగా తదితర కళలను భావితరాలకు అందించాలన్నారు. పిల్లలు కళారంగంలో ప్రావీణ్యం పొందే విధంగా బాల్యం నుంచే తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వైవిధ్యానికి నిదర్శనమైన మన కళలను పరిరక్షించుకోవాలని, ఆ దిశగా కృషిచేస్తున్న ఎస్.వీ. జీ. కళావర్షిణి లాంటి సంస్థల సేవలు అభినందనీయమని పచ్చుడి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు డా. శ్రీదేవిరాగి,ఎస్వీజీ కళావర్షిణి సంస్థ వ్యవస్థాపకురాలు సంధ్యారాణి, స్థానిక నాయకులు చాంద్ పాషా, బాలరామ్ యాదవ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్..!



**జగిత్యాల,మే 03,మన సాక్షి:**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ కాలేజ్‌లో జరగనున్న నీట్ రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రంలో రాయనున్న విద్యార్థులు మొదటి పరీక్ష కేంద్రంలో 480. రెండవ పరీక్ష కేంద్రంలో 278. మొత్తం 758 విద్యార్తులు పరీక్ష కేంద్రంలో సి సి కెమెరాలు 49. ఏర్పాటు చేశామని చెప్పారు పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగాకుండా పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసామని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ ఎమ్మార్వో రమేష్ జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ప్రభాకర్ మండల్ ఎస్పై సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి మోటార్ బైక్ కు నిప్పు..!

**చింతపల్లి,మే 03,మన సాక్షి:**



అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియ వ్యక్తులు మోటార్ బైక్ కు నిప్పు పెట్టి దగ్ధం చేసిన సంఘటన చింతపల్లి మండల పరిధిలోని కిష్టరాయినిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. చింతపల్లి ఎస్ఐ బి యాదయ్య తెలిపిన వివరాలు ప్రకారం కిష్టరాయని పల్లి గ్రామానికి చెందిన మోర శ్రీరాములు శుక్రవారం రోజు అతని యొక్క వ్యక్తిగత పనుల నిమిత్తం చింతపల్లి మండల కేంద్రానికి అతని ద్విచక్ర వాహనం పల్సర్ బైక్ టిఎస్ %ూ%5 ఇస్ 6181 నెంబర్ గల బైక్ పై వెళ్లి అక్కడ పనులు ముగించుకొని తిరిగి రాత్రి 8.30 గంటల సమయంలో కిష్టరాయన్ పల్లి గ్రామంలోని తన ఇంటికి చేరుకుని తన ఇంటి ఎదురుగా ఉన్న గ్రామపంచాయతీ ముందు తన మోటార్ బైక్ ను నిలిపి ఇంట్లోకి వెళ్ళాడు. అతను ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి1.10 నిమిషాలకు అతని తండ్రి మోర రామచంద్రం మూత్రం పోదామని బయటికి వెళ్లగా గ్రామపంచాయతీ ముందు నిలిపి ఉన్న మోటార్ బైకు తగలబడుతుండడంతో అది చూసి రామచంద్రం తన కుమారుడైన శ్రీరాములుకు చెప్పాడు. వెంటనే వెళ్లి చూడగా అతని యొక్క వాహనం మంటల్లో కాలిపోతుంది. వెంటనే నీటితో మంటలను ఆర్పేశాడు. దీంతో శ్రీరాములు శనివారం పోలీసులను ఆశ్రయించి స్టేషన్లో ఫిర్యాదు అందజేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన

**ముదిగొండ,మే 03,మన సాక్షి:**



మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖామాత్యులు భట్టి విక్రమార్క మల్లు ముదిగొండ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన లు చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బాణాపురం గ్రామం ఎస్సీ కాలనీ నుంచి మంగాపురం తండా గ్రామం వరకు 8 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మాణం చేయనున్న బీటీ రోడ్డు పనులకు, నాచెపల్లి గ్రామం నుంచి బాణాపురం తండా వరకు ఆరు కోట్ల 70 లక్షల రూపాయలతో నిర్మాణం చేయనున్న ఆర్ అండ్ బి బిటి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ముదిగొండ మండల కేంద్రంలో రూ. 22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 50 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి, మండలంలోని 27 గ్రామాల్లో రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న 84 అంతర్గత రోడ్ల పనులకు, రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న పాల శీతలీకరణ కేంద్ర ప్రహారీగోడ నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతతో రాజీ పడకుండా, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి,మండల తహశీల్దార్ సునీతా ఎలిజబెత్, మండల ప్రత్యేక అధికారిణి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి. కళావతి బాయి, పంచాయతీ రాజ్ ఇఇ వెంకట్ రెడ్డి, డిఇ కెవికె. శ్రీనివాస రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ ప్రతిష్ట కోసం కష్టపడుతున్న వారికే పదవులు

**నారాయణపేట టౌన్,మే 03,మన సాక్షి:**



పార్టీ జెండా పట్టి,కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసిన కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి సామాన్య మనిషికి అందేలా కృషి చేయాలని,కష్టించి పనిచేసే వారికే పార్టీ పదవులు మరి ఏదైనా పదవులు కల్పించడం జరుగుతుందని బండి వేణుగోపాల్ స్పష్టం చేశారు. శనివారం నారాయణపేట పట్టణంలోని వార్డు నంబర్ 22 సికిల్గేరి ప్రాంతంలో ఏర్పాటు చేసిన బస్తీ వాసులు మరియు కార్యకర్తల సమావేశం నందు ఆయన మాట్లాడుతూ సామాన్య మానవునికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అవసరాలను ఆనాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యపడుతుందని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే తెచ్చిన ప్రతి సంక్షేమ పథకం ప్రతి అర్హునికి అందేలా చేయడంతో మరోసారి నిరూపితమైందన్నారు. ఈరోజు కుల గణనను అత్యంత పారదర్శకంగా నిర్వహించి, దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టే విధంగా చేసిన ముఖ్యమంత్రి మన పాలమూరు ముద్దుబిడ్డ ఎనుముల రేవంతన్న మన తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా నిలబెట్టి చూపించారన్నారు. మన పాలమూరు బిడ్డగా కులగణన సంబరాలు జరిపి, రాష్ట్రాన్ని , కాంగ్రెస్ పార్టీ ప్రతి ప్రతిష్ట పెంచినందుకు మనమందరం గర్విద్దామన్నారు. కులగణన వల్ల ఓబీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ,విద్య, ఉద్యోగస్థితిగతులు తెలపడమే కాకుండా ఇప్పటివరకు ప్రభుత్వ పరంగా పొందిన, పొందాల్సిన అవసరాలను గుర్తించే భాగ్యం కలుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ నాగరాజు, కురువ సుధాకర్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమనంతరం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి. సలీం కాంగ్రెస్ పార్టీ వార్డ్ కమిటీని, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. 22 వార్డు కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షునిగా రాజేష్ గట్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అవి, సదాత్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ అత్తర్, సాజిద్, కార్యదర్శులుగా విజయకుమార్ ధూపత్,మహమ్మద్ ఉస్మాన్ హజారి, ప్రత్యేక ఆహ్వానితులుగా రిటైర్డ్ టీచర్ వాహిద్ మోల్ సాబ్, సందీప్ కళ్యాణి,నారాయణరావు మిస్కిన్, మోచి బాలప్పలను ఎన్నుకున్నారు.

# విజయవంతమైన ఉచిత సంతాన సాఫల్య శిభిరం



**నారాయణపేట టౌన్,మే 03,మన సాక్షి:**

హైదరాబాద్ ఇందిరా ఐవిఫ్ హాస్పిటల్ లిమిటెడ్,గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ లో నిర్వహించిన పిల్లలు లేని దంపతులకు ఉచిత సాఫల్యత శిభిరంలో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ గైనకాలాజిస్ట్ లు డాక్టర్స్ శిరీష ఐషా ఫాతిమా,గీత 40మంది స్త్రీలకు కౌన్సిలింగ్ ఇస్తూ తగు సూచనలు అందించారు అనంతరం వారు మాట్లాడుతు పిల్లలు లేని దంపతులు సరైన సమయంలో సంబంధిత వైద్యు లను సంప్రదించి ప్రత్యేక పరీక్షలు చేయించుకుని తగు వైద్యం తీసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సనిఉల్లా,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గెవితిమ్మరాయ స్వామి వారికి ప్రత్యేక పూజలు

**రామసముద్రం,మే 03, మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని కొండపై వెలిసిన గవితిమ్మరాయ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బట్టర్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి ఉదయం ఆలయ శుద్ధిచేసి పలు రకాల పుష్పములతో అలంకరణ చేసి అర్చనలు అభిషేకలు నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు గోవిందా గోవిందా అంటూ నామస్మరణలతో మారి మ్రోగిన గెవితిమ్మరాయస్వామి ఆలయం. అలాగే మండల కేంద్రంలోని చెంబకూరు రోడ్డులో ఉన్న శనేశ్వరస్వామి ఆలయం లో స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించిన పూజారి నాగార్జున భక్తులకు స్వామివారిని దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఆర్టీసీ మేనేజర్ పై దౌర్జన్యం..కార్ డ్రైవర్ అరెస్ట్..!

**నల్లగొండ,మే 03 ,మన సాక్షి:**




నల్లగొండ పట్టణానికి చెందిన లక్ష్మీ మల్ల వరుణ్ రాజ్ అనే కార్ డ్రైవర్ ప్రతిరోజు ఆర్టిసి బస్టాండ్ లో హైదరాబాద్ వెళ్ళు ప్లాట్ఫామ్ వద్ద కారును ఆపి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులను తన కారులో తీసుకుని వెళ్లేవాడని ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ ప్లాట్ఫామ్ వద్ద కారులోకి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తుండగా అక్కడ విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ బోనగిరి దేవేందర్ అడ్డుకొని కారునిక్కడ ఆపొద్దు వెళ్ళిపో అని చెప్పగా కారు డ్రైవర్ స్టేషన్ మేనేజర్ పై దౌర్జన్యం చేసి కారుతో గాయపరచినందున స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ మామిడి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదుతో అతన్ని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు టూ టౌన్ సిఐ రాఘవరావు ప్రకటనలో తెలిపారు.

# అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు

**కంగ్టి, మే 03, మన సాక్షి :-**



ఎరువులు విత్తనాలు క్రిమిసంహారక మందులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో హరీష్ పవర్ హెచ్చరించారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి డీలర్ల సమావేశం నిర్వహించి, ఎరువులు విత్తనాలు, క్రిమిసంహారక మందుల, చుట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విత్తనాలు రైతులకు విక్రయించాలని సూచించారు. మార్కెట్లో నాసికరకమైన విత్తనాలు అమ్మితే వారి షాప్ తో పాటు లైసెన్స్ ను రద్దుచేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. రైతులకు విక్రయ రసీదులను తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణదారులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**శాలిగౌరారం,మే 03,మన సాక్షి:**

శాలిగౌరారంలోని విజ్ఞాన జ్యోతి జ్యోతి హైస్కూల్ 2008-09 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం స్థానిక ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ను ఘనంగా జరుపుకున్నారు. స్కూల్ నుంచి విడిపోయి 16 సంవత్సరాల తరువాత ఒకరినొకరు ఒకే వేదిక మీద కలుసు కోవడం తో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరి నొకరు ఆప్యాయతగా పలకరించుకొని తమ మనోభావాలు పంచుకున్నారు. పాఠశాల లో చదువుకున్న రోజులను జ్ఞప్తికి తెచ్చుకున్న మైమరచి పోయారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమం లో అప్పటి హెచ్ ఎం, కర%శీ%స్పాడెంట్ బుడిగె శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పడాల అంతయ్య, కొడవటికంటి సుబ్రహ్మణ్యం శర్మ, రావుల వీరయ్య, అబ్దుల్ సలాం, చెవుగోని సత్యనారాయణ, బెల్లంకొండ స్వామి, భూపతి సైదులు, వేముల సోమయ్య, మద్ది అరుణ, రజిత, డెంకల వెంకటమ్మ, పూర్వ విద్యార్థులు రావుల శంకర్, అదే నాగరాజు, అనుముల నాగరాజు, పాక మహేష్, బండారు మహేష్, నూతి నాగరాజు,చరణ్ తేజ, భాషబోయిన శంకర్,గౌర బీరప్ప, తాందారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి



**అర్వపల్లి,మే 03,మన సాక్షి:**

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి పురస్కారాన్ని రేఖ ఫౌండేషన్ చైర్పర్సన్ డాక్టర్ రేఖ బోయినపల్లి అందజేశారు. శనివారం తన సొంత గ్రామమైన అడివేముల, గ్రామానికి చెందిన వర్రె శ్రావ్య, అర్వపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ మండల టాపరుగా 562 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా బండారి ఉదయాంజలి 502 మార్కులు సాధించడంతో ఇద్దరు విద్యార్థులకు 5016, రూపాయలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం నగదు బహుమతులను అందజేస్తామని అన్నారు, తమ ప్రతిభతో వారి భవిష్యత్తును బంగారు బాట వేసుకోవచ్చని, తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, సొంత గ్రామానికి, మంచి పేరు వచ్చేల విద్యార్థిని విద్యార్థులు చదువుకోవాలని అన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**రామసముద్రం,మే 03,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా బాధిత కుటుంబాలకు చేయూత అందిస్తూ, వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి తిరిగి గౌరవంగా జీవనం సాగించేలా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. శనివారం రాజంపేట పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయనిది చెక్కులను పంపిణీ చేశారు. బొల్లినేని లీలావర్ధన కు 25 వేలు, రామదాసు రామశేఖర్ కు 95537 రూపాయల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలంటే తలకి మించిన భారం అవుతుందని, ఆర్థికంగా అంతంత మాత్రమే ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఏపీ ముఖ్యమంత్రి , జగన్మోహన్ రాజుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# డి.కొత్తపల్లి పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం




**అర్వపల్లి,మే 03,మన సాక్షి:**

డి.కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ ప్రారంభించారు. నెల రోజులపాటు నిర్వహించే ఈ శిబిరంలో తెలుగు ఆంగ్లము గణితం సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి తెలిపారు. గ్రామము మరియు పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న ఎవరైనా ఈ శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు అందరూ కూడా పాఠశాలకు హాజరైతారని తెలిపారు. కొత్తపల్లి శివారు ప్రాంతం, నుండి వచ్చే విద్యార్థులకు విద్యా సంవత్సరం పూర్తి అయ్యేంతవరకు ఆటో చార్జీలు ప్రధానోపాధ్యాయురాలు స్వచ్ఛందంగా చెల్లిస్తానని అన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# శ్రీ సీతారామ ఆంజనేయ స్వామి వార్ల లక్ష తులసి దళార్చన

**సూర్యాపేట,మే 03,మన సాక్షి:**



పునర్వసు నక్షత్రం,వైశాఖమాసం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పుట్టినరోజులు పురస్కరించుకొని శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత బజన మందిరంలో దేవాలయ అర్చకులు ధరూరీ సింగరాచార్యులు, రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా మాస కళ్యాణం తో పాటు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్లకు లక్ష తులసి దళార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి అష్టోత్తర పారాయణాన్ని సామూహికంగా నిర్వహించగా మందిర అర్చకులు లక్ష తులసి అర్చన పూజలు నిర్వహించారు.

అంతకు ముందు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలకు పంచామృతములతో అభిషేకం నిర్వహించి నూతన పట్టు వస్త్రములు అలంకరింప జేసీ నిర్వహించారు. జైశ్రీరామ్ అంటూ ప్రతి ఒక్కరు శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి వారలను కీర్తిస్తూ అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, కమిటీ సభ్యులు సోమ సుమన్,షీలా శంకర్,కక్కిరేణి విజయ్, వరగాని వెంకటేశ్వర్లు, వాస కృష్ణ, వెంపటి అప్పారావు' చిత్తలూరి శ్రీధర్, చల్లా సత్యనారాయణ,జక్కుల గిరి, రావుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మరింత కఠినంగా డ్రైవింగ్ లైసెన్స్ ప్రాసెస్..



తెలంగాణ: తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ పొందడం ఇక మరింత కష్టతరం కానుంది. కొత్తగా ట్రాక్‌తో పాటు సిమ్యులేటర్‌పై డ్రైవింగ్ నైపుణ్యాలను శాస్త్రీయంగా పరీక్షించనున్నారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రవాణాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. మొదటి దశలో 18 ఆర్టీవో కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి రానుంది. సిమ్యులేటర్ పరీక్షలో డ్రైవింగ్ చేసేవారి స్పందనలను కూడా కెమెరాల ద్వారా పరిశీలిస్తారు.

తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ ప్రాసెస్ మరింత కఠినతరం కానుంది. డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షా విధానాన్ని సమూలంగా మార్చేందుకు రాష్ట్ర రవాణాశాఖ సిద్ధమవుతోంది. ప్రస్తుతం కేవలం ఖాళీ మైదానంలో వాహనం నడిపించి లైసెన్స్ పొందుతున్న విధానానికి తెరపడనుంది. కొత్త విధానంలో డ్రైవింగ్ నైపుణ్యాన్ని కేవలం ట్రాక్‌పైనే కాకుండా అత్యాధునిక సిమ్యులేటర్ పరికరంతో శాస్త్రీయంగా పరీక్షించనున్నారు. ఈ ప్రతిపాదనలకు రవాణాశాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.

ప్రస్తుతం అమల్లో ఉన్న విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ కావాల్సిన అభ్యర్థులు ఖాళీ మైదానంలోని ఆకారపు ట్రాక్‌లపై వాహనం నడిపితే డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేస్తున్నారు. రివర్స్ డ్రైవింగ్‌లో నైపుణ్యం లేకపోయినా.. కొందరు దళారుల సహాయంతో సులభంగా డ్రైవింగ్ టెస్ట్ పాసవుతున్నారు. ఇలా సరైన డ్రైవింగ్ నైపుణ్యం లేని వారు రోడ్లపై వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. లేదా వారు ఇతరుల ప్రమాదాలకు కారణమవుతున్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. 2023లో 22,093 ప్రమాదాలు జరగగా.. 2024 నాటికి అది 25,934కు చేరుకుంది. ఈ ప్రమాదాల్లో వరుసగా 28,682, 31,559 మంది బాధితులయ్యారు. ఈ ప్రమాదాలకు సరైన డ్రైవింగ్ రాకపోవడం ఒక ముఖ్య కారణమని గుర్తించిన రవాణాశాఖ, డ్రైవింగ్ నైపుణ్యాన్ని మరింత కఠినంగా పరీక్షించాలని నిర్ణయించింది. కొత్త విధానంలో భాగంగా.. మైదానంలోని టెస్ట్ ట్రాక్‌తో పాటు, సిమ్యులేటర్‌పై కూడా డ్రైవింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. సిమ్యులేటర్ అనేది నిజమైన కారు నమూనాను పోలి ఉండే ఒక పరికరం. ఇందులో కారులో ఉండే స్టీరింగ్, క్లచ్, బ్రేక్, గేర్లు అన్నీ ఉంటాయి. హార్డ్‌వేర్‌తో పాటు, ఎదురుగా ఒక స్క్రీన్ ఉంటుంది. దానిపై సాఫ్ట్‌వేర్ ద్వారా రహదారి, ఇతర వాహనాలను చూడవచ్చు. సిమ్యులేటర్‌పై అభ్యర్థి స్టీరింగ్ తిప్పడం, గేర్లు మార్చడం వంటి చర్యలను బట్టి స్క్రీన్‌పై వాహనం కదులుతుంది. పక్కనుంచి ఇతర వాహనాలు వెళుతున్నట్లు కూడా ఉంటుంది. అంతేకాకుండా, వర్షం లేదా పొగమంచు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా సిమ్యులేటర్‌లో సృష్టిస్తారు. అప్పుడు అభ్యర్థి డ్రైవింగ్ నైపుణ్యం ఎలా ఉందో విశ్లేషిస్తారు.

డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యే వారి ముఖ కవళికలు కెమెరాల్లో రికార్డ్ అవుతాయి. అధిక ట్రాఫిక్ ఉన్నప్పుడు లేదా ఇతర వాహనాలు దగ్గరగా వస్తున్నప్పుడు అభ్యర్థి ఎలా స్పందిస్తున్నారు, ఒత్తిడికి గురవుతున్నారా? లేదా? అనే విషయాలను కూడా విశ్లేషిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 61 ఆర్టీవో కార్యాలయాలు ఉండగా.. మొదటి దశలో 18 కార్యాలయాల్లో 34 సిమ్యులేటర్లను ఏర్పాటు చేయాలని రవాణాశాఖ ప్రతిపాదించింది. ఈ సిమ్యులేటర్లను ప్రైవేట్ సంస్థల ద్వారా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పరీక్ష నిర్వహణకు అతి తక్కువ ఫీజును ప్రతిపాదించే సంస్థను టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. ఫీజుల రూపంలో వచ్చే ఆదాయంలో 50 శాతం రవాణాశాఖకు వచ్చేలా అధికారులు నిబంధనలు రూపొందిస్తున్నారు.

## బసంత్‌నగర్‌లో కాదు.. మరో ప్రాంతానికి తరలింపు..!



తెలంగాణ: తెలంగాణలో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పెద్దపల్లిలో నిర్మించ తలపెట్టిన విమానాశ్రయాన్ని బసంత్‌నగర్‌కు బదులుగా అంతర్గాం ప్రాంతానికి తరలించనున్నారు. బసంత్‌నగర్‌లోని వాతావరణ, భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో అంతర్గాం మండలంలో 591 ఎకరాల భూమిని గుర్తించి, సంబంధిత నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించింది.

తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. పెద్దపల్లి ప్రాంతంలోనూ కొత్తగా ఎయిర్‌పోర్టు నిర్మించనున్నారు. అయితే ముందుగా అనుకున్న బసంత్‌నగర్ కాకుండా మరో ప్రాంతానికి ఎయిర్‌పోర్టు తరలించనున్నారు. బసంత్‌నగర్‌లో వాతావరణ పరిస్థితులు, భౌగోళిక అంశాలు అనుకూలంగా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం మండలంలో సుమారు 591 ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. ఈ భూములకు సంబంధించిన రెవెన్యూ మ్యాపులు, గత పదేళ్ల వాతావరణ రిపోర్టులు, సైట్ వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి సమర్పించారు.

అంతర్గాంలో ఎంపికైన భూములతో పాటు, మరికొన్ని భూములను అదనంగా సేకరించే అవకాశమున్నదని సమాచారం. వాతావరణ నివేదికలు కూడా అనుకూలంగా ఉండటంతో, ఈ భూములు విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల కేంద్ర అధికారుల బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చింది. ఈ దశలో, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి, అంతర్గాంలో ప్రీ ఫీజబిలిటీ స్టడీ చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఇదివరకే బసంత్‌నగర్‌లో (రామగుండం సమీపంలో) దాదాపు 260 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం నిర్మించారు. అప్పట్లో అక్కడ ఎయిర్‌స్ట్రిప్‌తోపాటు విమానాలు కూడా నడిచాయి. కానీ కాలక్రమంలో ఆ సేవలు నిలిచిపోయాయి.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విమానాశ్రయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చింది. వరంగల్ జిల్లా మామునూరు, బసంత్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రాన్ని కోరుతూ లేఖలు పంపింది. ఇప్పటికే మామునూరులో విమానాశ్రయానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. అక్కడ అదనంగా అవసరమైన భూముల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇక బసంత్‌నగర్‌లో పలు సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతం ఉన్న స్థలంలో విమానాశ్రయం నిర్మాణం సాధ్యపడలేదు. అయినా పెద్దపల్లి జిల్లాలోనే వేరే ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది.

ఈ క్రమంలోనే అంతర్గాం మండలంలో భూములను పరిశీలించింది. కాగా, ఎయిర్‌పపోర్టు నిర్మాణంతో అంతర్గాం ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. ఈ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. ఊహించనంతగా అభివృద్ధి జరగనుంది.

# మే 5న అటు వెళ్లకండి.. రోడ్లన్నీ బంద్..

హైదరాబాద్: మే 5న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ నేపథ్యంలో రాచకొండ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11:50 గంటల వరకు భారీ వాహనాలపై నిషేధం ఉంటుంది. వివిధ ప్రాంతాల నుండి ఉప్పల్ వెళ్లే వాహనాల కోసం ట్రాఫిక్ మళ్లింపులు ఏర్పాటు చేశారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు కోరారు. మ్యాచ్ సమయానికి కనీసం ఒక గంట ముందుగానే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

క్రికెట్ అభిమానులకు పండుగ వాతావరణం నెలకొంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా మే 5వ తేదీన ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు హోరాహోరీగా తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు వేలాది మంది ప్రేక్షకులు తరలిరానుండటంతో.. రాచకొండ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. మ్యాచ్ జరిగే ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ముఖ్యంగా.. స్టేడియం పరిసరాల్లో లారీలు, డంపర్లు, ఎర్త్ మూవర్లు, వాటర్ ట్యాంకర్లు, ఆర్‌ఎంసీ ట్రక్కుల వంటి



భారీ వాహనాలపై పూర్తి నిషేధం విధించారు. ఈ ఆంక్షలు మే 5వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11:50 గంటల వరకు అమల్లో ఉంటాయి. పోలీసులు ప్రజలు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి.. ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని తమకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాఫిక్ మళ్లింపుల వివరాలను కూడా పోలీసులు స్పష్టంగా తెలియజేశారు.

రామంతపూర్ నుండి ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు స్ట్రీట్ నెంబర్ 8 మీదుగా ఉప్పల్ ఎక్స్ రోడ్ వైపు మళ్లిస్తారు. దీనివల్ల రామంతపూర్ నుండి నేరుగా ఉప్పల్‌కు వెళ్లే వాహనాల రద్దీ తగ్గుతుంది. అలాగే, చెంగిచెర్ల, బోడుప్పల్ మరియు పీర్జాదిగూడ నుండి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను టయోటా షోరూమ్ ముందు నుండి హెచ్‌ఎండీఏ భగాయత్ రోడ్డు మీదుగా నాగోల్ వైపు మళ్లించనున్నారు. ఈ మార్గం ద్వారా వచ్చే వాహనాలు నేరుగా ఉప్పల్‌లోకి ప్రవేశించకుండా నాగోల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఎల్బీ నగర్ నుండి నాగోల్ లేదా ఉప్పల్ వెళ్లే వాహనాల కోసం నాగోల్ మెట్రో స్టేషన్ కింద ఉన్న యు-టర్న్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. ఈ వాహనాలు హెచ్‌ఎండీఏ లేఅవుట్ మరియు బోడుప్పల్ మీదుగా చెంగిచెర్ల ఎక్స్ రోడ్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. తార్నాక నుండి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను హబ్సిగూడ ఎక్స్ రోడ్ వద్ద ఎడమవైపుకు తిప్పి, నాచారం, ఐఓసిఎల్ చెర్లపల్లి, స్ట్రీట్ నెంబర్ 8 మరియు హబ్సిగూడ మీదుగా మెట్రో పిల్లర్ 972 వద్ద ఉన్న యు-టర్న్ ద్వారా ఉప్పల్ ఎక్స్ రోడ్ వైపు మళ్లిస్తారు. ఈ మార్గం తార్నాక నుండి వచ్చే వాహనాలకు ఉప్పల్‌కు చేరుకోవడానికి ప్రత్యామ్నాయంగా ఉంటుంది. పోలీసులు ప్రజలకు సూచిస్తూ.. మ్యాచ్ సమయానికి కనీసం ఒక గంట ముందుగానే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. సాధ్యమైనంత వరకు వ్యక్తిగత వాహనాలకు బదులుగా మెట్రో రైలు వంటి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలని సూచించారు. స్టేడియం పరిసరాల్లో పార్కింగ్ స్థలాలు పరిమితంగా ఉంటాయని.. కేవలం పాస్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. దీంతో పాటు.. ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.

# తెల్లవారుజామునే పని కానిచ్చేస్తున్నారు..

**బాపట్లకు చెందిన ఓ యువకుడు తన తల్లితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి చీరాలకు వెళ్లేందుకు సింహపురి ఎక్స్‌ప్రెస్ ఎక్కగా, రైలు బయలుదేరే సమయంలో ప్లాట్‌ఫాంపై ఉన్న ఒక వ్యక్తి ఆ యువకుడి తల్లి మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కొని పారిపోయాడు.**



సికింద్రాబాద్: వేసవి రద్దీతో ట్రైన్లు కిటకిటలాడుతున్నాయి. కొన్ని ట్రైన్లలో అయితే కాలు పెట్టేందుకు కూడా జాగా ఉండట్లేదు. అదే సమయంలో దొంగలు రెచ్చిపోతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అలసటతో గాఢ నిద్రలోకి జారుకుంటుండగా.. అదే అదనుగా చోరీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామునే చోరీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే పోలీసులు అలర్ట్ జారీ చేస్తున్నారు. అనుమాని తులు కనిపిస్తే.. 100 లేదా 139కు కాల్ చేయాలని సూచిస్తున్నారు. వేసవి సెలవుల కారణంగా ట్రైన్లలలో రద్దీ విపరీతంగా పెరిగింది. పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లే కుటుంబాలతో బోగీలన్నీ కిక్కిరిసి ఉంటున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అలసిసొలసి గాఢ నిద్రలో చుట్టుపక్కల ఏం జరుగుతుందో పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న దొంగలు రెచ్చిపోతున్నారు. అవకాశాన్ని వినియోగించుకుంటూ అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతో తమ విలువైన వస్తువులు పోగొట్టుకున్న బాధితులు దిక్కుతోచని స్థితిలో సమీపంలోని రైల్వే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి సంవత్సరం వెయ్యికి పైగా దొంగతనాల ఫిర్యాదులు నమోదవుతున్నాయి. దొంగలు ఇప్పుడు చోరీ చేసే విధానాన్ని కూడా మార్చారు. ముఖ్యంగా తెల్లవారుజామున నిద్రమత్తులో ఉన్న దూర ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలకు చెందిన చిల్లర దొంగలు ముఠాలుగా ఏర్పడి వరుస చోరీలకు పాల్పడుతుండటం గమనార్హం. రైలు కదలడానికి కొద్దిసేపటి ముందు లేదా వేగం బాగా తగ్గిన తర్వాత దొంగతనాలకు పాల్పడుతున్నారు. కిటికీలు, డోర్ల దగ్గర కూర్చున్న మహిళా ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని వారి సెల్‌ఫోన్లు, మెడలోని గొలుసులు లాక్కొని పారిపోతున్నారు. లింగంపల్లికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగిని గత నెలలో విజయనగరం వెళ్లి తిరిగి వస్తుండగా నాగవల్లి ఎక్స్‌ప్రెస్‌లో తెల్లవారుజామున ఆమె మెడలోని 38 గ్రాముల బంగారు గొలుసును ఎవరో లాక్కొని వెళ్లారు. అలాగే.. బాపట్లకు చెందిన ఓ యువకుడు తన తల్లితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి చీరాలకు వెళ్లేందుకు సింహపురి ఎక్స్‌ప్రెస్ ఎక్కగా, రైలు బయలుదేరే సమయంలో ప్లాట్‌ఫాంపై ఉన్న ఒక వ్యక్తి ఆ యువకుడి తల్లి మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కొని పారిపోయాడు. ఈ నేరాలను నియంత్రించడానికి రైల్వే పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పెట్రోలింగ్ సిబ్బందితో భద్రతను పెంచామని అధికారులు తెలిపారు. వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సిగ్నల్స్‌ను ట్యాప్ చేసి రైళ్లను ఆపి దోపిడీలు చేసే ముఠాలు ప్రస్తుతం లేవని, ప్రస్తుతం జేబుదొంగలు, చైన్ స్నాచర్లే ఎక్కువగా దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసులు వెల్లడించారు. దూర ప్రయాణాల్లో ప్రయాణికులు బంగారు ఆభరణాలు ధరించకపోవడం ఉత్తమమని సూచించారు. ఒకవేళ అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా చోరీ జరిగినా వెంటనే డయల్ 100 లేదా 139కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# తెలంగాణలో మరో అంతర్జాతీయ ఫెస్టివల్..

తెలంగాణ: ఫెస్టివల్ అంటే ఎవరికైనా ఆనందంగా ఉంటుంది. అదికూడా స్నేహితులతో కలిసి చేసుకుంటే ఆ సంతోషమే వేరు. అలాంటి ఆ ఆనందకర ఘడియలకు తెలంగాణ రాష్ట్రం వేదిక కానుంది. హైదరాబాద్ నగరంలో మొట్టమొదటిసారిగా టమాటా ఫైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం మే 11వ తేదీన ఉదయం 10 గంటలకు మొదలు అవుతుంది. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న సుమారు 25 వేల జాతుల అరుదైన వృక్షాలు, మొక్కలు, శిల్పాలతో కూడి ఉన్న 'ఎక్స్‌పీరియం' ఎకో పార్క్ దీనికి వేదిక కానుంది.


తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం సరికొత్త ఉత్సాహానికి వేదిక కానుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపేందుకు ఒక అద్భుతమైన



అవకాశం త్వరలో నగరవాసులను పలకరించనుంది. హైదరాబాద్ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒక ప్రత్యేకమైన.. ఉల్లాసభరితమైన టమాటా ఫైట్ ఫెస్టివల్ జరగబోతోంది. ఈ టమాటా ఫైట్ ఫెస్టివల్ స్పెయిన్‌లోని ప్రసిద్ధ లా టమాటినా పండుగ నుండి ప్రేరణ పొందింది.

వేల కిలోల టమాటాలను ఒకరిపై ఒకరు విసురుకుంటూ ఆనందించే ఈ ప్రత్యేకమైన వేడుక మే 11, 2025న ఉదయం 10 గంటల నుండి హైదరాబాద్ నగర శివారులోని 'ఎక్స్‌పీరియం' ఎకో పార్క్‌లో జరగనుంది. ఈ ఎకో పార్క్ ఒక ప్రత్యేకమైన అనుభూతినిస్తుంది. 85 దేశాల నుండి దిగుమతి చేసుకున్న సుమారు 25 వేల జాతుల అరుదైన వృక్షాలు, మొక్కలు మరియు అద్భుతమైన శిల్పాలతో ఇది ఆహ్లాదకరమైన ప్రదేశంగా విరాజిల్లుతోంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు వద్ద ప్రముఖ వ్యాపారవేత్త రాందేవ్ రావు ఆరున్నరేళ్ల సుదీర్ఘ శ్రమతో 150 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశాలమైన ఎకో పార్క్‌ను తీర్చిదిద్దారు. దేశంలోనే అతి పెద్దదిగా పేరుగాంచిన ఈ ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది జనవరిలో ప్రారంభించారు. ఇక్కడ పాల్గొనేవారు వేల కిలోల టమాటాలను ఒకరిపై ఒకరు విసురుకుంటూ తమ ఆనందాన్ని వెలిబుచ్చుతారు. అంతేకాదు.. ఈ వేడుకలో లైవ్ డీజే సంగీతం యువతను ఉర్రూతలూగిస్తుంది.. నృత్య ప్రదర్శనలు అందరినీ అలరిస్తాయి. రుచికరమైన ఆహారాన్ని అందించే ఫుడ్ స్టాల్స్‌తో పాటు.. షాపింగ్ ప్రియుల కోసం ప్రత్యేకంగా మార్కెట్ కూడా ఏర్పాటు చేయబడుతుంది. పిల్లలు, పెద్దలు ఆనందించేందుకు ప్రత్యేకమైన ఫన్ జోన్స్ కూడా ఉంటాయి. ఈ ప్రత్యేకమైన అనుభవాన్ని పొందడానికి టికెట్ల ధరలు రూ. 499 నుండి ప్రారంభమై రూ. 3,499 వరకు వివిధ కేటగిరీలలో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వేసవి తాపంతో అల్లాడుతున్న హైదరాబాదీలకు ఈ టమాటా ఫైట్ ఫెస్టివల్ ఒక సరికొత్త.. సరదా అనుభవాన్ని అందించడంలో సందేహం లేదు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి నవ్వులు, కేరింతల మధ్య గడిపేందుకు ఇది ఒక చక్కని అవకాశం.

## ఒక్క పథకంతో.. 900 కోట్ల ఆదాయం..




హైదరాబాద్: హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపు పథకం ఏప్రిల్ 1 నుండి ప్రారంభమవుతుంది. దీని ద్వారా పన్ను చెల్లించిన వారికి 5 శాతం రిబేటు లభిస్తుంది. ఈ పథకం జీహెచ్ఎంసీకి ఆదాయాన్ని పెంచడానికి.. పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూర్చడానికి ఉద్దేశించబడింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చెల్లింపు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పన్ను చెల్లింపు విధానం ఏప్రిల్ 30 వరకు ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి భారీ మొత్తంలో ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రోత్సాహం అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎప్పటినుంచో 'ఎర్లీ బర్డ్' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో.. అంటే ఏప్రిల్ 1వ తేదీ నుండి మొదలవుతుంది. ఈ పథకం కింద.. ఆస్తి పన్నును ఏప్రిల్ 30వ తేదీలోగా ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రిబేటు లభిస్తుంది.


ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం పన్ను చెల్లింపుదారులను ముందుగానే పన్నులు చెల్లించేలా ప్రోత్సహించడం. దీనివల్ల జీహెచ్ఎంసీకి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ఆదాయం సమకూరుతుంది. ఈ నిధులను నగర అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించవచ్చు.

మరోవైపు.. పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రిబేటు లభించడం వల్ల వారిపై ఆర్థిక భారం కొంతమేరకు తగ్గుతుంది. గత కొన్నేళ్లుగా ఈ పథకానికి నగర ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా ఏప్రిల్ 1 నుండి 30 వరకు ఈ పథకం అమల్లో ఉండగా.. రికార్డు స్థాయిలో 79 లక్షల మందికి పైగా పన్ను చెల్లింపుదారులు దీనిని సద్వినియోగం చేసుకున్నారు. దీని ద్వారా జీహెచ్ఎంసీకి రూ. 900 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు 70 కోట్ల రూపాయలు అధికం. జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను చెల్లింపు ప్రక్రియను కూడా చాలా సులభతరం చేసింది. పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్ ద్వారా జీహెచ్ఎంసీ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చు. అంతేకాకుండా.. మీసేవా కేంద్రాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్లు మరియు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో కూడా పన్నులు చెల్లించే సౌకర్యం ఉంది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు వివిధ రకాల పేమెంట్ గేట్‌వేలను అందుబాటులో ఉంచారు. సమయానికి పన్ను చెల్లించని వారికి ప్రతి నెలా 2 శాతం చొప్పున అపరాధ రుసుము విధిస్తారు. కాబట్టి.. ఎర్లీ బర్డ్ పథకం ద్వారా రిబేటు పొందడంతో పాటు అపరాధ రుసుము భారం నుండి కూడా తప్పించుకోవచ్చు.

## 16 ఏళ్ల బాలుడిని 28 ఏళ్ల యువతి.. పోక్సో కేసు నమోదు

హైదరాబాద్: రోజురోజుకు సమాజంలో హింస పెరుగిపోతోంది. దానికి లింగం, వయస్సు లాంటి ఎలాటి తారతమ్యాలు ఉండటం లేదు. ముక్కుపచ్చలాని పసిగుడ్డును చూస్తే కళ్లు మూసుకుపోతాయి ఒకడికి. కాటికి కాళ్లు చాపిన బామ్మపై కోరిక కలుగుతదని మరొకడికి.తమ కోరికలు తీర్చుకునేందుకు ఎలాంటి అడ్డదారులైనా తొక్కుతారు. మహిళలపైనే కాకుండా.. భార్యల చేతిలో హత్యకు గురయ్యే భర్తలు, మహిళల కోరికలకు బలయ్యే మగాళ్లు కూడా రోజురోజుకు ఎక్కువే అయితున్నారు.

లైగింక వేధింపులు, గృహహింస, అత్యాచారం, పొక్సో కేసులు, కాస్టింగ్ కౌచ్.. ఎక్కువగా మహిళ విషయంలో వింటుంటాం. అలా అని పురుషులకు ఇలాంటి ఇబ్బందులు లేవని కాదు. కాకపోతే బయటకు వచ్చేవి తక్కువగా ఉండటం, చాలా మంది చెప్పుకోవడానికి సంశయిస్తుంటారు. చెప్పినా.. మగాడివి నీకేందిరా అనే మాటలే వినిపిస్తాయి. కానీ, ఇలాంటి విషయాల్లో చాలామంది పురుషులు కూడా సతమతమవుతుంటారు. ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.




16 ఏళ్ల బాలుడిపై 28 ఏళ్ల యువతి లైంగికంగా వేధించిందని బాలుడి తల్లి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి వచ్చింది. తన లైంగిక కోరిక తీర్చుకునేందుకు బాలుడికి ఆశ చూపి లోబరుచుకుందని బాధితుడి తల్లి ఆరోపిస్తుంది. అంతేకాకుండా లైంగికంగా వేధించి, శారీరకంగా, మానసికంగా హింసించిందని వాపోయింది. తన వాంఛ తీర్చుకునేందుకు తన కుమారుడి జీవితంతో ఆడుకుందని పోలీసులను ఆశ్రయించింది ఆ తల్లి. పొక్సో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆ యువతిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లైంగిక వేధింపులకు పురుషులేం అతీతులు కాదు. స్త్రీల కోరికలకు బలయ్యే మగాళ్లు కూడా సమాజంలో లేకపోలేదు. తమ అవసరాల కోసం మగాళ్లను లోబరుచుకొని వేధించే మహిళలు కూడా ఉన్నారు. కారణం ఏదైనా కావచ్చు.. కానీ పురుషులు కూడా హింసను ఎదుర్కుంటూనే ఉన్నారు. భార్య చేతిలో, ప్రేయసి దగ్గర, స్నేహితురాళ్ల ముందు అవమానాలకు గురయ్యే మగరాయుల్లు ఎందరో ఉన్నారు. షీ టీం వలె.. హీ టీమ్ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందేమో..!

# యూట్యూబర్

## అనుమానాస్పద మృతి..

**ఎన్టీఆర్ జిల్లా:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మధుమతి అనుమానాస్పద మృతి కలకలం రేపుతోంది. మధుమతి తన అమ్మమ్మ ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఎన్టీఆర్ జిల్లాలోని విస్సన్నపేట మండలంలోని ఏ.కొండూరు గ్రామానికి చెందిన మధుమతి సామాజిక మాధ్యమాల్లో చాలా యాక్టివ్‌గా ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తూ ఓ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. ఈ వీడియోలకు లక్షల్లో సబ్‌స్క్రైబర్లు కూడా ఉన్నారు. అయితే మధుమతి అనుకోని రీతిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందటం ఇప్పుడు కలకలం రేపుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



పెళ్లి చేసుకుంటానన్నాడు, ఒంటరిగా రమ్మని..

పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం.. మధుమతి ఇటీవల తన అమ్మమ్మను చూడటానికి తన సొంతూరు ఏ. కొండూరు వెళ్లింది. గురువారం రాత్రి మధుమతి చాలా సేపు తన గదిలోనే ఉండిపోయింది. కుటుంబసభ్యులు పదే పదే తలుపు తట్టినా స్పందించ లేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కిటికీలో నుంచి లోపలికి తొంగి చూస్తే మధుమతి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించారు. దీంతో వెంటనే తలుపులు బద్ధలుకొట్టి గదిలోకి వెళ్లారు. మధుమతిని వెంటనే స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.. అయితే అప్పటికే మధుమతి చనిపోయి నట్లు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరిం చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టు మార్టం కోసం మధుమతి మృతదేహాన్ని తరలించారు.

అయితే తమ బిడ్డ మృతికి ప్రతాప్ అనే వ్యక్తి కారణమని మధుమతి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తెల్లదేవరపల్లికి చెందిన ప్రతాప్ వేధింపుల కారణంగానే మధుమతి చనిపోయిందని చెప్తున్నారు. మధుమతి కుటుంబసభ్యులు చెప్తున్న వివరాల ప్రకారం ప్రతాప్‌కు అప్పటికే పెళ్లైంది. అయితే మధమతితో ప్రతాప్?కు పరిచయమైంది. ప్రతాప్ ప్రవర్తన కారణంగా మధుమతి మానసికంగా, ఎమోషనల్‌గా ఒత్తిడికి గురైందని మధుమతి తల్లిదండ్రులు చెప్తున్నారు. దీంతో ఈ కఠిన నిర్ణయం తీసుకుందని చెప్తున్నారు. మధుమతి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మధుమతి సెల్‌ఫోన్?ను పోలీసులు సీజ్ చేశారు. మధుమతి కాల్ డేటా, సోషల్ మీడియా కమ్యూనికేషన్లను పరిశీలిస్తున్నారు, మధుమతి కుటుంబసభ్యులు, స్నేహితులు, గతకొన్నిరోజులుగా ఆమెతో కాంటాక్టులో ఉన్నవారిని పోలీసులు ఆరా తీస్తున్నారు. మధుమతిది ఆత్మహత్య అని ప్రాథమిక సాక్ష్యాధారాల ఆధారంగా తెలుస్తోందన్న పోలీసులు.. ఫోరెన్సిక్, సైబర్ ఇన్వెస్టిగేషన్ తర్వాతే అసలు కారణాలు తెలుస్తాయని చెప్తున్నారు. మధుమతి మరణాన్ని అనుమానాస్పద మృతి కింద దర్యాప్తు చేస్తున్నారు.

# కొత్తగా రైల్వే బైపాస్ లైన్ రూ.రూ.296 కోట్లతో..

**ఆంధ్రప్రదేశ్:** ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో కొత్త బైపాస్ రైల్వే లైన్‌కు శంకుస్థాపన చేశారు. రూ.296 కోట్లతో 10 కిలోమీటర్ల మేర ఈ మార్గం నిర్మించనున్నారు. అయితే, ఈ ప్రాజెక్టుకు భూసేకరణ సమస్యగా మారింది. కర్నూలు జిల్లా రైతులు తమ భూములు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ అమరావతిలో జరిగిన భారీ బహిరంగ సభలో రాజధాని పునర్నిర్మాణ పనులతోపాటు వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.. వీటిలో నేషనల్ హైవేలతో పాటూ రైల్వే పనులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల్లో మరో ముఖ్యమైన గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో కొత్త బైపాస్ రైల్వే లైన్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. గుంతకల్లు రైల్వే స్టేషన్ దగ్గర మల్లప్పగేట్ నుంచి గుంతకల్లు పడమర రైల్వే స్టేషన్ వరకు 10 కిలోమీటర్ల పొడవైన మార్గం ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ కోసం రూ.296 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్లో గూడ్సు రైళ్లను నిలపడానికి స్థలం లేదు.. అందుకే స్టేషన్‌కు దూరంగా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే ఈ బైపాస్ లైన్ అందుబాటులోకి వస్తే ఈ సమస్య తీరుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. ఈ రైల్వే లైన్ కోసం 48 ఎకరాల భూమి కావాలి.. ఆ భూమి అంతా కర్నూలు జిల్లాలో ఉండగా.. గుంతకల్లు, చిప్పగిరి మండలాల రైతులు ఈ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. చిప్పగిరి మండలం రైతులు తాము ఎక్కువగా నష్టపోతున్నామంటున్నారు.. భూసేకరణపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 16న చిప్పగిరి రైతులతో తహసీల్దారు మాట్లాడారు.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వే లైనుకు పక్కనే ఇంకో లైను వేస్తే సమస్య కొంతవరకు తగ్గుతుందన్నారు. కానీ రైల్వే అధికారులు మాత్రం అంగీకరించలేదు.. ప్రస్తుతం గుంతకల్లు రైల్వేస్టేషన్లో రైళ్లకు గానీ, గూడ్సు రైళ్లకు గానీ ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం బైపాస్ నిర్మించాల్సిందే అంటున్నారు. దీంతో ఈ విషయం తమ పరిధిలో లేదని తహసీల్దారు రైతులకు చెప్పారు. భూసేకరణ చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రైతులు అంటున్నారు. మరి ఆందోళనలో మధ్యలోనే ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు.. త్వరలోనే ఈ పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రైతుల సమస్యలను రైల్వే అధికారులు ఎలా డీల్ చేస్తారో చూడాలి.

# ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు..

**ఆంధ్రప్రదేశ్:** ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది.. వారికి పదోన్నతులు కల్పించేందుకు సిద్ధమైంది. మెరిట్ రేటింగ్ రిపోర్టుల ఆధారంగా సుమారు 110 మంది అధికారులకు పదోన్నతులు లభించనున్నాయి. అంతేకాకుండా, ఏపీ ఫైబర్‌నెట్‌కు రూ.112.50 కోట్ల నిధులు, గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దేవాదాయశాఖ పరిధిలోని భూములను సేవా సంస్థలకు కేటాయించేందుకు నిబంధనలు సవరించింది.

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది. ఇటీవల ఉద్యోగులకు పెండింగ్ ఉన్న బకాయిల్ని చెల్లించగా.. ఆ తర్వాత ఆయా శాఖల్లో అధికారులు, ఉద్యోగుల ప్రమోషన్లు, కారుణ్య నియామకాలను చేపట్టింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో ఇటీవల ప్రమోషన్లు చేపట్టారు. తాజాగా ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగులకు పదోన్నతులపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఆర్టీసీ (పీటీడీ)లో ఉద్యోగుల మెరిట్ రేటింగ్ రిపోర్టులను (ఎంఆర్ఆర్స్) పరిగణలోకి తీసుకుని ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల్లో ఏసీఆర్స్ (వార్షిక రహస్య నివేదికలు)ను పరిగణలోకి తీసుకుంటారు.. ఆర్టీసీలో మాత్రం ఎంఆర్ఆర్స్ (మెరిట్ రేటింగ్ రిపోర్టులు)ను పరిగణలోకి తీసుకుంటారు. ఈ నిర్ణయంతో దాదాపు 110 మంది అధికారులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది అంటున్నారు.

ఇటీవల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రీజినల్ మేనేజర్, సీనియర్ స్కేల్ అధికారి, చీఫ్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ ఎకౌంట్స్ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వంటి పోస్టులకు పదోన్నతులు ఇవ్వడానికి ఒక కమిటీ సమావేశమైంది. ఆ సమయంలో ఆర్టీసీ అధికారులు, పదోన్నతులకు అర్హులైన ఉద్యోగుల ఎంఆర్ఆర్ఎస్‌ను అందజేశారు. 2020 జనవరి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు.. దీంతో వారికి ఏసీఆర్ఎస్ ఉండాలని, అప్పుడే పదోన్నతులు ఇవ్వగలమని కమిటీ చెప్పింది. ఆర్టీసీ ఉద్యోగులు 2020 జనవరి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతో ఆయా అధికారులకు చెందిన ఏసీఆర్స్ ఉండాలని డీపీసీ పేర్కొని, పదోన్నతులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఉద్యోగులకు పదోన్నతులు ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో.. ఈసారి ఎంఆర్ఆర్ఎస్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఉద్యోగులకు ఊరట లభించింది.



**ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు...**

ఏపీ ఫైబర్‌నెట్‌కు రూ.112.50 కోట్ల అదనపు నిధులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎస్ఏఎస్‌సీఐ) కింద 2025-26లో వినియోగించుకునేందుకు అనుమతించాలని సంస్థ ఎండీ ప్రభుత్వాన్ని కోరారు. మౌలిక వసతులు, నిలిచి న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కొనసాగించే ందుకు వీలుగా నిధులు అవసరమని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అధ్వాన్నంగా ఉన్న 1,250 కి.మీ గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్ల నాబార్డ్ గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులు (ఆర్ఐడీఎఫ్) మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంతలు పూడ్చినా బాగుపడే అవకాశం లేని 191 గ్రామీణ రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలు, సంస్థలకు చెందిన వ్యవసాయేతర భూములు, దుకాణాల లీజులు, లైసెన్సులను వేలం లేకుండా, కనీస ధరతో సేవా సంస్థలకు కేటాయించేందుకు వీలు కల్పించేలా నిబంధన సవరిస్తూ ప్రభుత్వం శుక్రవారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. కనీసం 20 ఏళ్లుగా లాభాపేక్ష లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థలకు ఈ లీజులు, లైసెన్సులు ఇచ్చేందుకు వీలు కల్పిస్తారు. గరిష్ఠంగా 33 ఏళ్ల వరకే ఇవ్వాలని నోటిఫికేషన్‌లో ప్రస్తావించారు. సవరించిన ఈ నిబంధన 30 రోజుల్లో అమల్లోకి వస్తుందని, ఇంతలో దీనిపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే దేవాదాయశాఖ కార్యదర్శికి పంపాలని కోరారు.

> ఆర్టీసీ ఉద్యోగులు 2020 జనవరి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతో ఆయా అధికారులకు చెందిన ఏసీఆర్స్ ఉండాలని డీపీసీ పేర్కొని, పదోన్నతులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఉద్యోగులకు పదోన్నతులు ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో.. ఈసారి ఎంఆర్ఆర్ఎస్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఫోటోలతో సహా ఆస్తుల వివరాలు..



**ఆంధ్రప్రదేశ్:** మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తన ఆస్తుల చిట్టాను ఫేస్‌బుక్ ద్వారా బహిర్గతం చేశారు. తనకున్న ఇళ్లు, స్థలాలు, కార్లు, బైక్‌లతో సహా అన్ని వివరాలను వెల్లడించారు. ఇటీవల తన కుమారుడితో కలిసి కారు ఫోటో దిగడం, ప్రవీణ్ పగడాల కేసుతో లింక్ చేస్తూ విమర్శలు రావడంతో ఆయన ఈ విధంగా స్పందించారు. తన ఆస్తుల గురించి వస్తున్న ఊహాగానాలకు చెక్ పెట్టేందుకే ఆయన ఈ నిర్ణ యం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎంతోమంది నేతలు కొనసాగుతు న్నారు.. కొందరు నేతలు వారి ఆస్తుల వివరాలను ఓపెన్‌గా చెబుతుంటారు. కొందరు మాత్రం ఆ వివరాలను కాస్త రహస్యంగానే ఉంచుతారు. ఈ మాజీ ఎంపీ మాత్రం అలా కాదు.. సోషల్ మీడియా వేదికగా తన ఆస్తుల చిట్టా మొత్తాన్ని ఓపెన్‌గా చెప్పేశారు. తనకు ఉన్న ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఖరీదైన కార్లు, బైక్‌తో సహా వివరాలను బయటకు చెప్పేశారు.. ఇంతకీ ఆయన ఎవరనే కదా మీ అనుమానం.. అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్. ఫేస్‌బుక్ వేదికగా తన ఆస్తుల వివరాలను వెల్లడించారు.

'ఇవి నాకున్న కార్లు, ఒక బుల్లెట్. ఇంకోటి ప్రచార రథం, కూడా ఉన్నాయి. వర్షంలో మునిగి పోయి చెడి పోయింది. అది అమ్మేసాను.ఎందుకు కొన్నానంటే ప్రతి నెల లక్ష రూపాయలు రామకృష్ణ మఠం ఎదురుగా ఉన్న భారత్ పెట్రోలియం బంక్‌కు కడతాను. ఇది ఎలక్ట్రికల్ కార్ హైద్రాబాద్ వెళ్లాలంటే 500 రూపాయలు మాత్రమే అవుతుంది. అంటే ఒక్కసారి ఛార్జ్ చేస్తే 500 వెళ్ళవచ్చు. పనికిమాలిన ఊహా గానాలు మానేయండి.ప్రతి కారు ఫైనాన్స్ లోనే కొన్నుకుంటాము. ప్రతి కారుకు లెక్క పత్రాలు ఉంటాయి. ఇకపోతే రాజమండ్రిలో 1000 గజాలలో 10 కోట్లు విలువ చేసే ఇల్లు ఉంది . వైజాగ్ లో ఆక్సిజన్ టవర్స్‌లో 35 ఫ్లోర్‌లో 3 కోట్ల విలువ చేసే ప్లాట్ ఉంది. అమలాపురంలో ఒక ఇల్లు కొంటున్నాను.. ట్రాన్సక్షన్ పూర్తి అవ్వలేదు' అన్నారు. 'ముమ్మిడివరం లో రెండున్నర ఎకరాల మామిడి తోట ఉంది. ఒక అర ఎకరం బ్రిడ్జి హైవే మీద ఉంది. దానిలో ఫుడ్ కోర్ట్ , ఫంక్షన్ హాల్ , స్విమ్మింగ్ పూల్ ఉన్నాయి. 3 ఎకరాల ఫార్మ్ హౌస్ ఉంది. అది కాలేజ్ పేరు మీద ఉంటుంది.. ఒక కాలేజీ ఉంది. డిగ్రీ పీజీ, ప్రొఫెషనల్ కోర్సెస్ , ఫాషన్ టెక్నాలజీ ఫార్మసీ కాలేజీ ఉన్నాయి. ఉంది. దీనిలో ఒక్క ఇల్లు తప్ప ఇంక ఏది నా పేరు మీద ఉండదు.. అన్ని కొడుకుల పేర్ల మీదే ఉంటాయి. మాది ఉమ్మడి కుటుంబం కాబట్టి నావి అని చెప్పుతున్నాను. అన్ని మీవే కదా.. పంపించండి. ఏ, ఏ ఆస్తులు ఎలా కొన్నానో ఏ ఏ కార్లు ఎలా కొన్నానో తెలుస్తుంది' అంటూ ఫేస్‌బుక్ పోస్ట్ పెట్టి మరీ ఆస్తుల వివరాలను ఓపెన్‌గా అందరి ముందు చెప్పారు. ఇంతకీ మాజీ ఎంపీ హర్షకుమార్ తన ఆస్తుల వివరాలు ఎందుకు ఓపెన్‌గా చెప్పారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆయన ఇటీవల తన కుమారుడితో కలిసి ఓ కొత్త కారు ముందు నిలబడి ఫోటో తీసుకున్నారు. కొందరు ఈ ఫోటోను ప్రస్తావిస్తూ.. ప్రవీణ్ పగడాల కేసుకు లింక్ చేస్తూ విమర్శలు చేశారు.. ఈ క్రమంలోనే మాజీ ఎంపీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.. ఆస్తుల వివరాలను వెల్లడించారు.

# రేషన్‌కార్డులు ఉన్నవారికి ఈ నెల కూడా ఛాన్స్ లేదు..

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డుదారులకు మే నెలలో కూడా కందిపప్పు అందడం లేదు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నుంచే సరఫరా నిలిచిపోవడంతో, గత నాలుగు నెలలుగా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అన్ని సరుకులు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, కందిపప్పు సరఫరా మాత్రం జరగడం లేదు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే కందిపప్పు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ-కేవైసీ గడువును జూన్ 30 వరకు పొడిగించారు. ఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కార్డులు ఉన్నవారికి ఈ నెల కూడా నిరాశ తప్పడం లేదు. మే నెలలో కూడా తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి కందిపప్పు అందడం లేదు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నుంచే కందిపప్పు కేటాయింపులు జరగలేదని చెబుతున్నారు.. రేషన్ డీలర్లు కూడా డబ్బులు చెల్లించలేదు. ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేయడం మొదలు పెట్టినా.. ఈ నెల కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రకాల సరుకులు ఇస్తామని చెప్పినా.. కందిపప్పు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో రేషన్‌కార్డులు ఉన్నవారు నిరాశలో ఉన్నారు.

కూటమి ప్రభుత్వం గత ఏడాది నవంబర్ నెలలో ప్రజా పంపిణీ వ్యవస్థపై దృష్టి పెట్టింది.. రేషన్‌కార్డులు ఉన్నవారికి అన్ని రకాల సరుకులు ఇస్తామని చెప్పింది. మొదట వంద శాతం కార్డుదారులకు కందిపప్పు ఇచ్చారు.. అనంతరం డిసెంబర్, జనవరి నెలల్లో మాత్రం 50 శాతం కుటుంబాలకే ఇచ్చారు. గత నాలుగు నెలలుగా రేషన్‌కార్డులు ఉన్నవారికి కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొత్త కాంట్రాక్ట ర్లకు బాధ్యతలు అప్పగించినా, కందిపప్పు సరఫరా మాత్రం జరగలేదు. కేవలం బియ్యం, అర కిలో పంచదార మాత్రమే ఇస్తున్నారు.

బయట మార్కెట్లో కందిపప్పు ధరలు ఎక్కువగా ఉన్నాయని.. ఇలాంటి సమయంలో రేషన్ షాపుల్లో ఇచ్చే కందిపప్పు కూడా ఇవ్వకపోతే ఇబ్బందిపడుతున్నామంటున్నారు. గత నాలుగు నెలలుగా రేషన్ షాపులకు కందిపప్పు సరఫరా చేయడం లేదంటున్నారు. ఈ నెలలో ఇస్తారేమో అని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. మే నెలలో కందిపప్పు పంపిణీ చేయడానికి టెండర్లు



పిలిచామని అధికారులు చెబుతున్నారు.ఈ ప్రక్రియ పూర్తయితే కందిపప్పు అందజేస్తామంటున్నారు. ప్రజలు మాత్రం కందిపప్పు ఎప్పుడు ఇస్తారో అని ఎదురు చూస్తున్నారు. నాలుగైదు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయడం లేదని.. కనీసం వచ్చే నెల నుంచైనా అందుబాటులో ఉంచాలని జనాలు కోరుతున్నారు. ఈ అంశంపై అధికారులు స్పందించాల్సి ఉంది. ఇదిలా ఉంటే రేషన్‌కార్డులు ఉన్నవారికి ఊరట దక్కింది.. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయడానికి గడువును జూన్ 30 వరకు పొడిగించారు. ఈలోపు ఆ ప్రక్రియను పూర్తి చేయాలంటున్నారు.

# అంతా ఉచితం... రూపాయి కట్టక్కర్లేదు..

**పల్నాడు:** ఉచితంగా విద్యాబోధన.. యూనిఫామ్, భోజనం.. వసతి కూడా.. అలాగని అదేమీ ప్రభుత్వ పాఠశాల కాదు.. ప్రైవేట్ విద్యాసంస్థ. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం మైనంపాడులో ఉన్న నైస్ విద్యాసంస్థ అనాథ పిల్లలకు ఉచితంగా విద్యాబోధన అందిస్తోంది. నైస్ విద్యాసంస్థలో విద్యాబోధనతో పాటుగా ఉచితంగా హాస్టల్ వసతి కూడా ఉంది. 2025-26 విద్యా సంవత్సరం కోసం ప్రస్తుతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

అడ్మిషన్ ఫీజు.. యాక్టివిటీస్ ఫీజు.. ఎగ్జామ్ ఫీజు.. ట్యూషన్ ఫీజు.. అదేదో సినిమాలో ఎల్బీ శ్రీరామ్ నోరు తెరిస్తే అప్పు.. అడుగు వేస్తే అప్పు అన్నట్లుగా నోరు తెరిస్తే ఫీజు, అడుగు వేస్తే ఫీజు అన్నట్లుగా తయారైంది ప్రస్తుత రోజుల్లో ప్రైవేట్ పాఠశాల పరిస్థితి. మరీ కార్పొరేట్ స్కూళ్లల్లో అయితే ఫీజుల దోపిడీ మామూలుగా ఉండదు. కానీ భయపడుతూనే హారర్ సినిమాలు చూసినట్లు.. బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించే సగటు మధ్యతరగతి జీవి.. అప్పుసొప్పైనా చేసి పిల్లలను ప్రైవేట్ బడికి పంపుతుంటాడు. అమ్మానాన్నా ఇలా బాధ్యతలు తీసుకుంటే సరి.. కానీ తల్లిదండ్రులు లేని వారి పరిస్థితి ఏంటి? అలాంటి వారికి అండగా నిలుస్తోంది ఓ విద్యాసంస్థ. రూపాయి ఫీజు లేకుండానే అనాథ పిల్లలకు ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఉచితంగా విద్యాబోధన అందిస్తోంది. విద్యాబోధన, యూనిఫామ్, భోజనం,



పుస్తకాలతో పాటుగా వసతి సదుపాయాన్ని కూడా ఉచితంగా అందిస్తోంది.

మైనంపాడులోని నైస్ అనే విద్యాసంస్థ అనాథ చిన్నారులకు ఉచితంగా విద్యాబోధన అందిస్తోంది. అలాగే వసతి కూడా అందిస్తోంది. అమ్మానాన్న ప్రేమకు దూరమైన అనాథలను అక్కున చేర్చుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ ఆ చిన్నారుల బంగారు భవితకు బాటలు పరుస్తోంది. 2003 ఆగస్టు 15వ తేదీన పోపూరి పూర్ణచంద్రరావు నైస్ విద్యాసంస్థను మైనంపాడులో ప్రారంభించారు. ఈ 23 ఏళ్లలో వందల మంది చిన్నారులకు విద్యను అందించారు. బోధనతో పాటుగా హాస్టల్స్‌కు కూడా ఏర్పాటు చేశారు. సీబీఎస్ఈ విద్యాబోధనను ఇక్కడ అందిస్తుండటం విశేషం. కేవలం పాఠాలు మాత్రమే చెప్పడం కాదు.. కంప్యూటర్, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్‌లు ఉన్నాయి. అలాగే సుమారు 4 వేల పుస్తకాలతో లైబ్రరీ అందుబాటులో ఉంది. ఇక విద్యార్థులు ఆడుకోవటం కోసం మైదానం కూడా అందుబాటులో ఉంది. అలాగే బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, కబడ్డీ వంటి ఆటలు.. ఇండోర్ గేమ్స్‌పైనా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు.

ప్రస్తుతం ఈ విద్యాసంస్థలో 150 మంది విద్యార్థుల వరకూ చదువుకుంటున్నారు. అలాగే 2025-26 విద్యా సంవత్సరం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అనాథ పిల్లలకు నైస్ విద్యా సంస్థలో ప్రవేశాలకు తొలి ప్రాధాన్యమిస్తారు. ఆ తర్వాత తల్లిని కోల్పోయిన ప్రాధాన్యం ఉంటుంది. మూడో ప్రాధాన్యంగా తండ్రిని కోల్పోయిన చిన్నారులను విద్యాసంస్థలో చేర్చుకుంటారు. అయితే 5, 6 తరగతుల్లోనే ఇందులో ప్రవేశాలుంటాయి. ఐదో తరగతిలో చేరాలంటే పదేళ్లు నిండి ఉండాలి. దరఖాస్తు చేసిన తర్వాత చిన్నారులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ అనంతరం నైస్ విద్యాసంస్థలో ప్రవేశం కల్పిస్తారు. ఇక నైస్ విద్యాసంస్థలో దరఖాస్తు చేయడానికి పిల్లల ఆధార్‌కార్డుతో పాటుగా, తల్లిదండ్రుల డెత్ సర్టిఫికేట్ తప్పనిసరి అని నైస్ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. ఇక ప్రవేశాల కోసం మే నెల నాలుగో ఆదివారం, జూన్ మొదటి ఆదివారం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఏ ప్రాంతం వారైనా నైస్ విద్యాసంస్థలో ప్రవేశాలకు అర్హులే.

# పెళ్లి చేసుకుంటానన్నాడు.. ఒంటరిగా రమ్మని

**రాజమండ్రి:** స్వీయానుభవమైతే కానీ తత్వం బోధపడదనేది పెద్దలు చెప్పేమాట. అంటే ఏ విషయంపై అయిన సొంత అనుభవం అయితే కానీ.. దాని వెనుక ఉన్న అసలు సంగతి బయటపడదని అర్థం. అయితే తెలివైన వాళ్లు స్వీయానుభవం కాకుండానే, చుట్టుపక్కల జరిగే సంగతుల నుంచి నేర్చుకుంటూ ఉంటారు. ఇక చుట్టుపక్కల ఏం జరుగుతోందో తెలుసుకోకుండా బావిలో కప్పలాగా బతుకీడుస్తుంటే.. ఇదిగో ఇలాగే జరుగుతుంది. రాజమండ్రి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన 32 ఏళ్ల మహిళకు ఇప్పటికే పెళ్లైంది. అయితే భర్తతో విభేదాలు రావటంతో విడాకులు తీసుకుని దూరంగా ఉంటున్నారు. అయితే ఇటీవల ఆ మహిళకు ఆన్‌లైన్ మ్యాట్రిమోనీ సైట్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. రాజమహేంద్రవరానికి చెందిన నారాయణ అనే వ్యక్తి.. మార్చి నెలలో ఆ మహిళకు పరిచయం అయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తాను రాజమండ్రిలో బంగారం వ్యాపారం చేస్తానని నమ్మబలికాడు. మనమిద్దరం పెళ్లి చేసుకుందామంటూ జాతకాలు అడిగాడు. జాతకం ఇచ్చిన తర్వాత ఇద్దరి జాతకాలు కలిశాయని.. పెళ్లి చేసుకుందామని చెప్పాడు. దీంతో ఆ మహిళ నమ్మేసింది. కొత్త జీవితం ప్రారంభిద్దామని ఆశపడింది. అయితే ఇంతలోనే కథ ట్విస్ట్ తిరిగింది.


ఈ క్రమంలోనే ఏప్రిల్ నెలలో ఆ మహిళకు నారాయణ ఫోన్ చేశాడు. జాతకాల్లో పితృదోషం ఉందని చెప్పాడు. దోష పరిహారం చేసుకోవాలని సూచించాడు. ఇందుకోసం రాజమహేంద్రవరం వస్తే పరిహారం చేయిద్దామని నమ్మబలికాడు. దీంతో ఆ మహిళ అతగాడి మాటలు నమ్మేసింది. ఏప్రిల్ 20వ తేదీన రాజమహేంద్రవరం వచ్చింది. ఇద్దరూ కలిసి కోటిలింగాల ఘాట్ వద్దకు వెళ్లారు. పితృ దోషం పరిహారం కోసం.. గోదావరి నదిలో స్నానం చేయాలని నారాయణ ఆ మహిళకు సూచించాడు. అయితే ఇక్కడే మనోడి కన్నింగ్ బుద్ధి బయటపడింది. స్నానం చేసే సమయంలో శరీరంపై ఎలాంటి నగలు ఉండకూడదనే నియమం ఉందని చెప్పాడు. దీంతో కేటుగాడి మాటల వెనుక మోసం గ్రహించలేని అమాయక మహిళ.. అతను చెప్పినట్లే చేసింది.

34 గ్రాముల బంగారు నగలతో పాటుగా 26 గ్రాముల వెండి పట్టీలు బ్యాగులో ఉంచి స్నానానికి వెళ్లింది. స్నానం చేసుకుని వచ్చిన తర్వాత.. తాను బ్యాగు వద్ద కాపలగా ఉంటానని చెప్పిన నారాయణ.. దుస్తులు మార్చుకొని రావాలని ఆ మహిళకు సూచించాడు. ఆమె దుస్తులు మార్చుకుని వచ్చేసరికి నగలున్నా బ్యాగుతో అక్కడ్నుంచి పరారయ్యాడు. బాధితురాలు ఫోన్ చేస్తే.. అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితు రాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతగాడి మోసం బయటపడింది. బాధితురాలి ఫిర్యాదు పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కపిలతీర్థంలో గన్‌లతో ఆక్టోపస్ దళాలు..


**తిరుపతి:** శ్రీ కపిలతీర్థం ఆలయంలో ఆక్టోపస్ దళాలు మాక్ డ్రిల్ నిర్వహించారు. కాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడితో ముందస్తు జాగ్రత్తగా ఈ డ్రిల్ చేశారు. ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలాంటి భద్రతాపరమైన చర్యలు చేపట్టాలనే అంశంపై ఆక్టోపస్, పోలీసు, టిటిడి విజిలెన్స్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సమిష్టిగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా కపిలతీర్థం సమీపంలో జిల్లా అటవీ శాఖ కార్యాలయం ప్రాంగణం నుండి ఆక్టోపస్ బలగాలు మూడు గ్రూపులుగా వ్యూహాత్మకంగా సమన్వయంతో ఆలయంలోకి ప్రవేశించి భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను శుక్రవారం సాయంత్రం మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపారు. ఉగ్రదాడి జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై టీటీడీ నిఘా మరియు భద్రతా, సివిల్ పోలీసులకు, బాంబ్ స్క్వాడ్, రిజర్వ్ సిబ్బందికి, వైద్య, ఫైర్ సిబ్బందికి, రెవిన్యూ , ట్రాఫిక్ సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. దాదాపు రెండు గంటలపాటు ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. ఈ మాక్ డ్రిల్ 40 మంది ఆక్టోపస్ కమాండోలు, 10 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, 15 మంది పోలీసులు, 13 ఏఆర్ సిబ్బంది, 12 మంది మెడికల్ సిబ్బంది, ఫైర్ , ఆర్మ్ , బాంబ్ స్క్వాడ్, ఎలక్ట్రికల్ , వాటర్, గ్యాస్ శాఖల సిబ్బంది మాక్ డ్రిల్ లో భాగమయ్యారు.

# అప్పులు తీర్చడానికే నటుడినయ్యా



తమిళ హీరో అజిత్‌కుమార్ ఇటీవలే న్యూఢిల్లీలో పద్మభూషణ్ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. సినిమాల్లోకి యాక్టర్‌గా రావడం వెనుకున్న పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "అసలు నాకు సినిమాల్లోకి రావాలనే ఉద్దేశం ఏనాడూ లేదు. అనుకోకుండా యాక్టర్ అయ్యా. మొదట్లో నా నటన ఘోరంగా ఉండేది. కెరీర్ తొలినాళ్లలో నేను చేసిన సినిమాలకు వేరేవారు డబ్బింగ్ చెప్పేవారు. ఆ తర్వాత కఠోర సాధనతో నన్ను నేను చాలా మెరుగుపరుచుకున్నా. ఇప్పటికీ కొందరు మిమిక్రీ ఆర్టిస్టులు మొదట్లో నేను చేసిన పేలవ నటన ఆధారంగా మిమిక్రీ చేస్తుంటారు. నిజానికి నాకు రేసర్ కావాలనే అశ ఉండేది. రేసింగ్ కోసం డబ్బులు సమకూర్చుకునే పనిలో మోడలింగ్ అవకాశం వచ్చింది. ఆ క్రమంలోనే సినిమా అవకాశాలూ వచ్చాయి. ఎవరైనా ఏదైనా అడిగితే నిజాయితీగా సమాధానం చెప్పేవాడ్ని. అప్పట్లో ఓ విలేకరి 'మీరు యాక్టింగ్‌ను ఎందుకు ఎంచుకున్నారు' అని అడిగారు. 'వ్యాపారంలో నష్టం వచ్చింది. నాకున్న అప్పులు తీర్చడానికి ఇండస్ట్రీలోకి వచ్చా' అని తడుముకోకుండా చెప్పేశా".





# మా అంకుల్ చిరంజీవి నా ఇన్‌స్పిరేషన్

## 'వేవ్స్'లో అల్లు అర్జున్

మానసిక ప్రశాంతతే తన ఫిట్‌నెస్‌కు కారణమని ప్రముఖ హీరో అల్లు అర్జున్ పేర్కొన్నారు. సిక్స్‌ప్యాక్ కోసం గతంలో చాలా కష్టపడ్డానని చెప్పారు. ముంబయిలో గురువారం ప్రారంభమైన 'వేవ్స్'లో ఆయన మాట్లాడారు. "'వేవ్స్' నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. బాల్యం నుంచే నాకు డ్యాన్స్ ఇష్టం. నా సినీ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు అధిగమించా. సినిమానే నా ప్రపంచం. అది తప్ప మరో ఆలోచన లేదు. ఎంతోమంది నాపై చూపించిన అభిమానం వల్లే ఈ స్థాయికి చేరుకున్నా. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది" అని పేర్కొన్నారు. చిరంజీవి గురించి మాట్లాడుతూ.. "మా అంకుల్ చిరంజీవి నాకు స్ఫూర్తి. ఆయన ప్రభావం నాపై ఎంతో ఉంది" అని పేర్కొన్నారు. తదుపరి సినిమా #AA22 (వర్కింగ్ టైటిల్)పై స్పందించారు. దర్శకుడు అట్లీ చెప్పిన ఐడియా తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. విజువల్ ఎఫెక్ట్స్‌లో ప్రేక్షకులకు కొత్త అనుభూతి పంచుతుందన్నారు.

మే 4 వరకు కొనసాగనున్న ఈ వేడుకలో చిరంజీవి, రజనీకాంత్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్ తదితర హీరోలతోపాటు ఇతర రంగాల ప్రముఖులూ నేడు హాజరయ్యారు. ఆ వేదికపై పలువురు సినీ సెలబ్రిటీలు పంచుకున్న సంగతులివీ..

**మోదీ ఫైటర్: రజనీకాంత్**

"ఇటీవల చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ సదస్సు వాయిదా పడే అవకాశాలున్నాయని చాలామంది అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై నమ్మకంతో ఈ సమ్మిట్ అనుకున్న సమయానికే జరుగుతుందని అనుకున్నా. మోదీ ఏ ఛాలెంజ్‌నైనా స్వీకరిస్తారు. కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొంటుంది. మోదీ ఓ ఫైటర్. వేవ్స్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఈ వేడుక నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు" అని రజనీకాంత్ పేర్కొన్నారు.

**ఆ వేదికే ఈ వేవ్స్: రాజమౌళి**

"మన దేశంలో చాలా భాషలున్నాయి. ఒక్కో దానికి వందేళ్లకుపైగా చరిత్ర ఉంది. ఎన్నో కళలున్నాయి. లెక్కలేనన్ని కథలున్నాయి. కథల విషయంలో ఏ దేశం ఇండియాకు సాటి రాదు. కానీ, అంతర్జాతీయంగా యూఎస్ఏ, సౌత్ కొరియా, చైనా తదితర దేశాలతో మనం సమానంగా లేం. మన శక్తిపై నాకెలాంటి సందేహం లేదు. కానీ, మనకు ఓ గొప్ప వేదిక అవసరం. అలాంటిదే ఈ 'వేవ్స్'" అని దర్శకుడు రాజమౌళి అభిప్రాయం వ్యక్తం చేశారు.


**అనుకున్న టైమ్‌కి వేవ్స్: షారుక్‌ఖాన్**

"ఫిల్మ్ ఇండస్ట్రీ స్టేటస్ కోరుకునే సమయంలో 'వేవ్స్' వచ్చింది. ఇలాంటి వేడుకల వల్ల భారతీయ సినిమాలు ప్రపంచ స్థాయిలో మరింత ఆదరణ దక్కించుకుంటాయి. థియేటర్లకు వచ్చే ప్రేక్షకులకు టికెట్టు ధరలు అందుబాటులో ఉండాలి" అని షారుక్‌ఖాన్ అన్నారు. సోషల్ మీడియా వినియోగంపై మాట్లాడుతూ.. "సామాజిక మాధ్యమాల్లో కనిపించాలని చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. ఆ ధ్యాసలో ఎవరేంటన్నది మర్చిపోతున్నారు. దాని బదులు పనిపై దృష్టిసారించి, మనల్ని మనం చూసుకుందాం" అని సలహా ఇచ్చారు.

**ఒక్కటే సినిమా: మోహన్‌లాల్**

"మలయాళ చిత్ర పరిశ్రమ కళలకు నిలయం. వినోదాన్ని అందించడమే కాకుండా కమర్షియల్‌గానూ విజయాన్ని అందుకున్న ఎన్నో అద్భుతమైన చిత్రాలు రూపొందాయి. నా 47 ఏళ్ల సినీ ప్రయాణంలో ఎంతో మంది గొప్ప దర్శకులతో పనిచేసే అవకాశం లభించింది. యువ దర్శకులతోనూ వర్క్ చేస్తున్నా. ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్నా మా చిత్రాలను ప్రేక్షకులు ఆర్ట్ ఫిల్మ్స్ అని పిలిచేవారు. కాబట్టి, ఆర్ట్, ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్స్ అంటూ వేరు చేసి చెప్పలేను. సినిమా అంతా ఒక్కటే" అని మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్ పేర్కొన్నారు.





# ఆశిష్.. దేత్తడి

ఆశిష్ హీరోగా ఆదిత్యరావు గంగసాని దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. దీన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 60వ సినిమాగా దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'దేత్తడి' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు గురువారం ఈ చిత్ర టైటిల్ లుక్‌ను విడుదల చేశారు. అందులో ఆశిష్ హుషారుగా డప్పు కొడుతూ చిందేయడం కనిపించింది. "హైదరాబాద్ నేపథ్యంగా సాగే రొమాంటిక్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. సంగీతానికి చాలా ప్రాధాన్యముంది. బలమైన భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. దీంట్లో ఆశిష్ మాస్ లుక్‌లో కనిపించడంతో పాటు హైదరాబాదీ యాసలో సంభాషణలు పలకనున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

# నేను కరెక్ట్ అని ప్రేక్షకులు మళ్లీ నిరూపించారు: నాని



'హిట్: ది థర్డ్ కేస్'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు కథానాయకుడు నాని. ఆయన.. శ్రీనిధి శెట్టి జంటగా శైలేశ్ కొలను తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఇది గురువారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్ మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా కథానాయకుడు నాని మాట్లాడుతూ.. "బుకింగ్స్ అదిరిపోయాయి. ఓపెనింగ్స్ బాగున్నాయి. ప్రేక్షకులు, పరిశ్రమ వర్గాల నుంచి మంచి టాక్ వస్తోంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో ఇదెంత దూరం వెళ్లి ఆగుతుందన్నది మా అంచనాలకీ అందట్లేదు. ఇది ఈ నెలంతా ఓ వేడుకలా కొనసాగుతుందని నమ్ముతున్నా. 'నేను, మీరు ఒకటేన'ని నేను నమ్మిన ప్రతిసారీ 'నేను కరెక్ట్' అని మీరు నిరూపించినందుకు ప్రతిఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు" అన్నారు. "నన్ను నమ్మినందుకు నానికి థ్యాంక్స్. నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాననుకుంటున్నా. ఈ చిత్రం కోసం మేమంతా చాలా కష్టపడ్డాం" అన్నారు దర్శకుడు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ రోజు తెలుగు చిత్ర పరిశ్రమ మళ్లీ ఊపిరి పీల్చుకుంది. సినిమాలొస్తున్నాయి.. కానీ, జనాలు థియేటర్లకు రావట్లేదు.. వేసవి అంతా అయిపోతోంది.. ఏపీ, తెలంగాణల్లో చాలా చోట్ల సింగిల్ స్క్రీన్లు మూసేశారు అనుకుంటున్నాం. ఇలాంటి తరుణంలో మేమంతా 'హిట్ 3'పైనమ్మకం పెట్టుకున్నాం. దీనికి ప్రేక్షకులొస్తారా? ఏస్థాయిలో థియేటర్లు నిండుతాయని ఊపిరి బిగబట్టుకుని చూశాం. అలాంటిది మూడు నాలుగు రోజుల ముందు నుంచే ఆన్‌లైన్ బుకింగ్స్‌తో నమ్మకం వచ్చింది. నాని నిర్మాతగా ఇప్పటికే ఓ విజయాన్నిచ్చాడు. ఇప్పుడు హీరోగా.. నిర్మాతగా మరో సూపర్ హిట్ ఇచ్చాడు. ఇలా ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు కొత్తదనమున్న సినిమాలిచ్చి.. వాళ్లను థియేటర్‌కు తీసుకొచ్చే బాధ్యత మాపై ఉంది.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.